బుధవారం 11 నవంబరు 2026 https://www.telugudesam.org



పారిశ్రామిక ప్రగతికి బూస్ట్

- 30కి పైగా ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం
- రూ.31,387 కోట్లతో విశాఖలో ఏఐ డేటా సెంటర్
- ఏవీజీసీ, రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ పాలసీలకు గ్రీన్ సిగ్నల్
- ఐటీ, ఏఐ, సెమీకండక్టర్ రంగాలకు ప్రోత్సాహం
- భారీ పెట్టుబడులకు భూకేటాయింపులు.. కొత్త పరిశ్రమలకు అనుమతులు
- ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రతకు ప్రత్యేక డైరెక్టరేట్
- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక పార్కు.. కొత్తగా ఉపాధి అవకాశాలు



2

జనవరిలో సహకార ఎన్నికలు

సీఎం సూత్రప్రాయ వెల్లడి

3



5

వేగంగా పంట నష్టాల నమోదు

- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం
- అర్నబ్, మురసు తుపానులతో 4,61,194 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం
- 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం..
- వ్యవసాయ, ఉద్యాన శాఖలతో మంత్రి టెలికాన్ఫరెన్స్

పరోక్ష ఎన్నికలకు షెడ్యూల్

- ఎంపీపీలు, జెడ్పీ చైర్‌పర్సన్ల ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ
- 19న ఎంపీపీలు.. 20న జెడ్పీ చైర్‌పర్సన్ల ఎన్నికలు
- 659 మండల పరిషత్‌లు, 28 జిల్లా పరిషత్‌లలో పరోక్ష ఎన్నికలు
- తొలుత కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక.. ఆ తర్వాత అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక



3



6

భవిష్యత్‌పై దృష్టిపెట్టండి

స్థానిక ఎన్నికల విజయంతో విర్రవీగొద్దు..

2029 ఎన్నికలే లక్ష్యం: సీఎం చంద్రబాబు

స్థానిక సంస్థల ఎన్నికల విజయాన్ని చూసుకొని గర్వంతో విర్రవీగొద్దని మంత్రులకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతతో, 2029 ఎన్నికలు లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. విజయాల తరువాత మరింత ఒద్దికగా ఉండాలని.. భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు.

వేగంగా పీపీపీ ప్రాజెక్టులు

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశం



3

నైపుణ్య శిక్షణతో ఎస్సీ యువతకు ఉపాధి



- సీఎం చంద్రబాబు సంకల్పం
- ఎస్సీ ఫిమేల్ నర్సింగ్ విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ
- శిక్షణ అనంతరం ఇజ్రాయెల్‌లో నెలకు రూ.2 లక్షల వేతనంతో ఉపాధి కల్పన
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

7

- తుపాను సాయం



ముఖ్యమంత్రి సహాయ నిధికి కృష్ణా డిస్ట్రిక్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ తరపున రూ. కోటి విరాళాన్ని బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అందించారు. సీఎంను సచివాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి చెక్కు అందించారు. తుఫానులను పంటలు నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు కేడీసీసీ బ్యాంక్ కామన్ గుడ్ ఫండ్ నుంచి ఈ విరాళాన్ని అందిస్తున్నట్టు రఘురామ్ తెలిపారు. సీఎం సహాయ నిధికి విరాళం అందించినందుకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్టుబడుల పండుగ

31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు విశాఖ సిద్ధం

ఈనెల 12, 13 తేదీల్లో విశాఖ సాగర తీరాన 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026 జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మంత్రులు, దౌత్యవేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలు సదస్సుకు హాజరుకానున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్న సదస్సులో సీఎం చంద్రబాబు కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. సింగపూర్, యూఏఈ, జపాన్, రష్యా సహా పలు దేశాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఏపీలో పెట్టుబడుల అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధి, ఏఐ, అంతరిక్ష సాంకేతికత, మహిళా సాధికారతపై సదస్సులో చర్చలు జరగనున్నాయి.

- విశాఖకు ఒకరోజు ముందుగానే సీఎం... పలువురితో భేటీలు
- విదేశీ ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలను కలవనున్న సీఎం
- ప్రపంచ నలుమూలల నుంచీ పారిశ్రామిక దిగ్గజాల రాక
- సింగపూర్, యూఏఈ, జపాన్, రష్యా, స్లోవేకియా, గ్వాటెమాల ప్రతినిధుల భాగస్వామ్యం

4





పారిశ్రామిక ప్రగతికి క్యాబినెట్ బూస్ట్

- 30కి పైగా ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం
- రూ.31,387 కోట్లతో విశాఖలో ఏఐ డేటా సెంటర్
- ఏవీజీసీ, రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ పాలసీలకు గ్రీన్ సిగ్నల్
- ఐటీ, ఏఐ, సెమీకండక్టర్ రంగాలకు ప్రోత్సాహం
- భారీ పెట్టుబడులకు భూకేటాయింపులు.. కొత్త పరిశ్రమలకు అనుమతులు
- ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రతకు ప్రత్యేక డైరెక్టరేట్
- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక పార్కు.. కొత్తగా ఉపాధి అవకాశాలు







అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపునిస్తూ, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, అత్యాధునిక సాంకేతిక రంగాలను ప్రోత్సహించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐటీ, పరిశ్రమలు, రెవెన్యూ, హోం, ఇంధన తదితర శాఖలకు సంబంధించిన 30కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ), సెమీకండక్టర్లు, రోబోటిక్స్, డేటా సెంటర్లు, బ్యాటరీ మెటీరియల్స్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది.

2026-31 కాలానికి ఏపీ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్‌ఆర్) పాలసీకి, ఏపీ రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ విధానాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే ఏపీ సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 2024-29 ముసాయిదా సవరణలకు కూడా పచ్చ జెండా ఊపింది. తద్వారా డిజిటల్ వినోద రంగం నుంచి అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ తయారీ వరకు వివిధ రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది.

ఏఐ డేటా సెంటర్లకు భారీ ప్రోత్సాహం

రాష్ట్రంలో ఏఐ, డేటా సెంటర్ల రంగాన్ని విస్తరించే దిశగా క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం ప్రాంతంలోని అమనాంలో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో రూ.31,387 కోట్ల భారీ పెట్టుబడితో 512 మెగావాట్ల సామర్థ్యం కలిగిన గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో అత్యాధునిక డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకంగా నిలవనుంది.

విజయనగరం జిల్లా భోగాపురంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్ కోసం సుమారు 25 ఎకరాల భూమి కేటాయింపునకు ఆమోదం తెలిపింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్ల పెట్టుబడితో ఈపాక్ సంస్థ ఏఐ డేటా సెంటర్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటుకు అనుమతించింది. ఈ పరిశ్రమ ద్వారా 2,565 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరోవైపు అదానీ గ్రూప్ ప్రతిపాదించిన క్లౌడ్ హబ్ ఏర్పాటుపై కూడా సమావేశంలో చర్చించి, తదుపరి పరిశీలన కోసం ఐటీ శాఖకు పంపినట్లు సమాచారం.

బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, ఫార్మా రంగాలకు ఊతం

పారిశ్రామిక తయారీ రంగంలో పెట్టుబడులను పెంచే క్రమంలో నాయుడుపేటలో కార్బన్ కాస్మో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ సంస్థ రూ.4,000.20 కోట్లతో ఏర్పాటు చేయనున్న బ్యాటరీ మెటీరియల్ తయారీ పరిశ్రమకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతిలో రూ.700 కోట్ల పెట్టుబడితో డిక్సన్ టెక్నాలజీస్ సంస్థకు స్థల కేటాయింపునకు అంగీకరించింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో గ్రూప్‌కు చెందిన ఫార్మా సంస్థలకు 173.82 ఎకరాల భూమి కేటాయింపునకు పచ్చజెండా ఊపింది.

పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ చేపట్టనున్న విస్తరణ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. అలాగే అన్నమయ్య జిల్లాలో 56.82 ఎకరాల విస్తీర్ణంలో స్కికార్ప్ ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ పార్కు, తంబళ్లపల్లెలో సుమారు 21 ఎకరాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కు ఏర్పాటుకు అనుమతించింది.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక పార్కు

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పరిధిలోని జయంతిపురంలో 30 ఎకరాల విస్తీర్ణంలో ఎఫ్ఎల్‌వో (ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్) పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మహిళలు స్వతంత్రంగా పరిశ్రమలు స్థాపించి, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన పారిశ్రామిక వసతులను కల్పించడం ఈ పార్కు ప్రధాన ఉద్దేశం. దీనివల్ల మహిళా పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

ట్రాఫిక్, రోడ్డు భద్రతకు ప్రత్యేక డైరెక్టరేట్

రాష్ట్రంలో పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాల నివారణను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్ ఏర్పాటుకు మంత్రివర్గం అంగీకరించింది. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని డీజీపీ ఆధ్వర్యంలో ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో ఈ విభాగం పనిచేయనుంది. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతా చర్యల అమలు, ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ రూపొందించడం ఈ డైరెక్టరేట్ బాధ్యతలుగా ఉండనున్నాయి.

ఇంధన రంగంలోనూ కీలక నిర్ణయాలు

సంప్రదాయ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు క్యాబినెట్ పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతించింది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా స్మాల్ మాడ్యులర్ రియాక్టర్స్ (ఎస్ఎంఆర్) సాంకేతికతతో అణు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు అంగీకరించింది.

విజయవాడలో 15 మెగావాట్ల సామర్థ్యంతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు ఏర్పాటుకు కూడా ఆమోదం తెలిపింది. ఇందుకోసం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఏపీ జెన్‌కోకు చెందిన 5.50 ఎకరాల భూమిని ఉచితంగా బదిలీ చేయనుంది. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు 192.68 ఎకరాల వక్ఫ్ భూమిని 30 ఏళ్ల దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేందుకు అంగీకరించింది.

విద్య, దేవాదాయ శాఖల్లోనూ నిర్ణయాలు


రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఐదు ఎకరాల భూమిని లీజుకు ఇవ్వడంతో పాటు స్టాంప్ డ్యూటీ మినహాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయించనుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రధాన సన్నిధి యాదవ, సన్నిధి యాదవ పోస్టుల ఏర్పాటుకు, దేవాదాయ శాఖలో సూపరింటెండెంట్ ఇంజినీర్ హోదాలో ముఖ్య స్థపతి పోస్టుల ఏర్పాటుకు అంగీకరించింది. మరోవైపు నాయుడుపేట సెజ్‌లో గతంలో వెబ్‌సోల్ రెన్యువబుల్స్, మెట్రో డెకరేటివ్ సంస్థలకు చేసిన భూ కేటాయింపులను రద్దు చేయాలని నిర్ణయించింది.

పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌పైనా చర్చ

విశాఖపట్నంలో ఈనెల 12, 13 తేదీల్లో జరగనున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నేపథ్యంలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలను బలోపేతం చేయడం వంటి అంశాలపైనా క్యాబినెట్ సమావేశంలో చర్చ జరిగినట్టు సమాచారం. ఇప్పటికే వివిధ రంగాల్లో భారీ పెట్టుబడులకు ఆమోదం తెలిపిన ప్రభుత్వం, వాటిని కార్యరూపంలోకి తీసుకురావడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐటీ, ఏఐ, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, పునరుత్పాదక ఇంధన రంగాల్లో తీసుకున్న తాజా నిర్ణయాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.







భవిష్యత్‌పై దృష్టిపెట్టండి

స్థానిక ఎన్నికల విజయంతో విర్రవీగొద్దు.. : 2029 ఎన్నికలే లక్ష్యం: సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): స్థానిక సంస్థల ఎన్నికల విజయాన్ని చూసుకొని గర్వంతో విర్రవీగొద్దని మంత్రులకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో మంగళవారం క్యాబినెట్ భేటీ ముగిశాక రాజకీయ అంశాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయగర్వాన్ని తలకెక్కించుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతతో, 2029 ఎన్నికలు లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. విజయాల తరువాత మరింత ఒద్దికగా ఉండాలని.. భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు.

మనం ప్రజలకు మేలు చేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేస్తున్నామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారితో చర్చించారు. పలు కీలక విషయాలపై మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

2029 ఎన్నికలపై దృష్టి పెట్టాలని.. ఆ దిశగా అందరం పని చేయాలని సూచించారు. ఇక కూరగాయల ధరలు తగ్గాయని.. బియ్యం ధరలు కూడా తగ్గించేందుకు ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలకు ధరల భారం ఉండకూడదన్నారు. మనం చేసే ప్రతి ప్రయత్నం ప్రజలకు ఉపయోగపడాలని సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తరువాత సొసైటీ ఎన్నికలు ఉంటాయని.. అందుకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాత మనమంతా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు.

బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో రైతు బజార్లలో ధర తగ్గించి బియ్యం విక్రయిస్తున్నామని ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆర్నాబ్, మురసు తుఫానుల నేపథ్యంలో కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చిన సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణకు బాగా పని చేశారని ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సీఎం చంద్రబాబు ఫోన్ చేయడంతో.. ఆయా రాష్ట్రాల నుంచి విద్యుత్ సిబ్బంది ఏపీకి వచ్చారని వివరించారు.

ఎంపీపీలు, జెడ్పీ చైర్‌పర్సన్ల

ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ

- 19న ఎంపీపీలు.. 20న జెడ్పీ చైర్‌పర్సన్ల ఎన్నికలు
- 659 మండల పరిషత్‌లు, 28 జిల్లా పరిషత్‌లలో పరోక్ష ఎన్నికలు
- తొలుత కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక..
- ఆ తర్వాత అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని మండల, జిల్లా పరిషత్‌లకు అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ మేరకు 659 మండల ప్రజా పరిషత్‌ల (ఎంపీపీలు), 28 జిల్లా ప్రజా పరిషత్‌ల (జెడ్పీపీలు)లో పరోక్ష ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. దీని ప్రకారం ఈ నెల 19న ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, 20న జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఈనెల 5న పోలింగ్ నిర్వహించగా, తుపాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలోని ఒకటి, ఏలూరు జిల్లాలోని నాలుగు మండలాల్లో పోలింగ్‌ను 6వ తేదీకి వాయిదా వేశారు. అలాగే, ఎన్నికల అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఐదు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో అదే రోజు రీపోలింగ్ నిర్వహించారు. అనంతరం ఈనెల 7న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలను ప్రకటించారు. ఈ ప్రక్రియ ముగియడంతో తాజాగా పరోక్ష ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు విడుదల చేసింది.

ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు తమలో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. అదే విధంగా జెడ్పీటీసీ సభ్యులు తమలో ఒకరిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, మరొకరిని వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారు. ఇందుకోసం సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తారు.

తొలుత కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక

ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, ప్రతి జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు, జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలకు ముందుగా కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారు. ఈ సభ్యులు మతపరమైన లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందినవారై ఉండాలి. 1995 మార్చి 11న జారీ చేసిన జీఓఎంఎస్ నంబర్ 131 ప్రకారం ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జొరాస్ట్రియన్లు (పార్సీలు) మతపరమైన మైనారిటీలుగా గుర్తింపు పొందారు. తెలుగు మాతృభాష కాని ఇతర భాషలను మాతృభాషగా కలిగినవారిని భాషాపరమైన మైనారిటీలుగా పరిగణిస్తారు.


ఎన్నికల రోజున ఉదయం 10 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. అలాగే మధ్యాహ్నం 1 గంట వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. 'చేతులెత్తడం' పద్ధతి ద్వారానే ఎంపీపీ, జడ్పీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల విప్‌కు లోబడే సభ్యులు ఓటు వేయాల్సి ఉంటుంది. పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటు వేస్తే సభ్యత్వం రద్దు చేయనున్నారు. కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు పార్టీ విప్ నిబంధన వర్తించదు. అధ్యక్ష లేదా చైర్‌పర్సన్ ఎన్నిక పూర్తయిన తర్వాతే ఉపాధ్యక్ష లేదా వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహిస్తారు. అనివార్య కారణాలతో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరగకపోతే.. ఆ వెంటనే జరిగే అధ్యక్ష, చైర్‌పర్సన్ ఎన్నికల సమావేశం రద్దవుతుంది.

కోరం లేకపోయినా లేదా ఇతర కారణాలతో ఎన్నిక వాయిదా పడితే.. మరుసటి రోజు (సెలవు దినమైనా సరే) మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ నిర్వహిస్తారు. ఎన్నికల సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానించనున్నారు. అయితే వారికి ఎలాంటి ఓటు హక్కు ఉండదు. పార్టీ విప్‌గా వ్యవహరించే వ్యక్తుల వివరాలను ఎన్నికకు ముందు రోజు ఉదయం 11 గంటలలోగా ప్రిసైడింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల పారదర్శకత కోసం వీడియో చిత్రీకరణ, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా లైవ్ కవరేజీకి అనుమతి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

14లోగా సమావేశాల నోటీసులు

నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈనెల 19న ఎంపీపీలు, 20న జెడ్పీపీల్లో నిర్వహించనున్న పరోక్ష ఎన్నికలకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను ఈనెల 14లోగా అందజేయనున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వివరణాత్మక విధివిధానాలు, మార్గదర్శకాలను కూడా జారీ చేసింది.

జనవరిలో సహకార ఎన్నికలు



అమరావతి (చైతన్య రథం): విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా దాదాపు రూ.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలు జరగనున్నాయని, తద్వారా 11 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో మంగళవారం క్యాబినెట్ భేటీ ముగిశాక రాజకీయ అంశాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు మంత్రులంతా తప్పనిసరిగా హాజరుకావాలని సీఎం ఆదేశించారు. ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.31 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని, వీటి ద్వారా 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. వచ్చే జనవరిలో సహకార ఎన్నికలు నిర్వహిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారమే సొసైటీ, పంచాయతీ, సహకార ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తికాగానే పరిపాలనను తిరిగి అభివృద్ధి మూడ్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కేబినెట్ సమావేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, జీఎస్డీపీపై చర్చించాలని నిర్ణయించారు. ప్రజలకు నిత్యావసరాలు అందుబాటు ధరల్లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

పీపీపీ ప్రాజెక్టులు వేగవంతం

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశం

అమరావతి (చైతన్య రథం): ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేపడుతున్న రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిపై ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. సచివాలయంలోని ఆర్ అండ్ బీ, ఐ అండ్ ఐ శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశమై ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలో 10 ప్రాజెక్టులను పీపీపీ విధానంలో, మరో ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో చేపడుతున్నట్లు మంత్రికి వివరించారు. మొత్తం 10 పీపీపీ ప్రాజెక్టుల్లో 6 ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు పూర్తి చేశామని, వాటిని కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు అవసరమైన వ్యాల్యూ గ్యాప్ ఫండింగ్ ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పీపీపీ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణకు అవసరమైన నిధులపై మంత్రి అధికారులతో చర్చించారు. భూసేకరణకు కావాల్సిన నిధులను సమకూర్చుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుల బిడ్డింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. పీపీపీ రహదారుల నిర్మాణానికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు ప్రజలకు మెరుగైన రహదారులు అందించేందుకు చేపట్టిన పీపీపీ ప్రాజెక్టులను వేగంగా పట్టాలెక్కించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్సీ శేషుకుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పెట్టుబడుల పండుగకు విశాఖ సిద్ధం

- 12, 13వ తేదీల్లో సాగర తీరాన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026
- విశాఖకు ఒకరోజు ముందుగానే సీఎం... పలువురితో భేటీలు
- విదేశీ ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలతో సమావేశం కానున్న సీఎం
- ప్రపంచ నలుమూలల నుంచి పారిశ్రామిక దిగ్గజాల రాక
- సింగపూర్, యూఏఈ, జపాన్, రష్యా, స్లోవేకియా, గ్వాటెమాల ప్రతినిధుల భాగస్వామ్యం



అమరావతి (చైతన్య రథం): ఏపీని పెట్టుబడులకు, పారిశ్రామికాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్–2026ను ప్రభుత్వం నిర్వహించనుంది. గతేడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సుకు భిన్నంగా 2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఇప్పటికే ఐదు ప్రాంతీయ సదస్సుల నిర్వహణతో రూ.86 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అలాగే వివిధ రంగాలపై ప్రాంతీయ సదస్సుల్లో చర్చలు జరిగాయి. దీంతో పెట్టుబడుల సదస్సులో ఎలాంటి చర్చలు జరుగుతాయోననే అంశంపై అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు, దౌత్యవేత్తలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, బహుళజాతి సంస్థల అధినేతలు హాజరుకానున్నారు. రెండు రోజులపాటు జరగనున్న సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని, వివిధ దేశాల ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామిక సంస్థల అధినేతలతో సమావేశం కానున్నారు. నవంబర్ 12 ఉదయం 10.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో సదస్సు ప్రారంభ కార్యక్రమం జరగనుంది. సదస్సు ప్రారంభ కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు. తర్వాత జరగనున్న వివిధ సెషన్లు, సమావేశాల్లో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు భాగస్వాములు కానున్నారు. అలాగే కీలక సమావేశాల్లో సీఎం చంద్రబాబు పాల్గొని... ఆయా అంశాలపై చర్చించడంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వివరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అందుబాటులో ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక విధానాలు, తయారీ, సాంకేతిక రంగాల్లోని అవకాశాలను పారిశ్రామిక వర్గాలకు సీఎం వివరిస్తారు.

అంతర్జాతీయ ప్రతినిధులతో సీఎం భేటీలు

సీఐఐ సమ్మిట్‌లో భాగంగా ముఖ్యమంత్రి పలు దేశాల మంత్రులు, రాయబారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతోనూ సమావేశమవుతారు. సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గ్వాటెమాలా, స్లోవేకియా దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులతో సీఎం భేటీ కానున్నారు. అలాగే జపాన్, రష్యా రాయబారులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. వీరితోపాటు ప్రపంచ మేధోసంపత్తి సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డారెన్ టాంగ్‌తో కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఇక సదస్సులో ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, నిర్మాణ సామగ్రి, మౌలిక సదుపాయాలు, మాన్యుఫ్యాక్చరింగ్, సాంకేతిక రంగాలకు చెందిన ప్రముఖులు భాగస్వాములు కానున్నారు. కియా మోటార్స్, రెన్యూ, మాండెలెజ్ ఇండియా, సెయింట్ గోబెయిన్, నాల్కో, లెవిస్టా వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు సదస్సులో భాగస్వాములు కానున్నారు. ఇక సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా స్పేస్ రంగంలోని స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు నిలవనున్నారు. అంతరిక్ష సాంకేతికత, పరిశోధన, తయారీ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను విస్తరించే లక్ష్యంతో ఈ తేదీన ప్రముఖ భారతీయ ప్రైవేటు అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో హాథోర్ రాకెట్స్, అగ్నికుల్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, స్కైరూట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. అలాగే జపాన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ చైర్మన్‌తో సీఎం భేటీ అవుతారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలోనే మహిళా సాధికారతకు ప్రాధాన్యతిస్తూ ఓ సమావేశం నిర్వహించనున్నారు. దీనికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. 'విమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్–2026' పేరుతో విశాఖ నోవోటెల్‌లో ప్రారంభ కార్యక్రమం జరగనుంది. మహిళల ఆర్థిక సాధికారత, పారిశ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యం, వ్యాపారవేత్తలుగా మహిళలకు ప్రోత్సాహం వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో చర్చించనున్నారు.

కేంద్రమంత్రులతో సీఎం వరుస భేటీలు

సదస్సులో వివిధ శాఖలకు చెందిన కేంద్రమంత్రులతో సీఎం ఈ రెండు రోజుల్లో సమావేశం కానున్నారు. వివిధ రంగాల్లో పారిశ్రామికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు... రాష్ట్రానికి అందించాల్సిన చేయూతపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. అలాగే రాష్ట్రంలోని వివిధ వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా కొన్ని వెసులుబాట్లు కల్పించే అంశాలను కేంద్రమంత్రుల వద్ద ప్రస్తావించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తలెత్తుతున్న పరిణామాలతో రాష్ట్రంలోని పలు రంగాలపై పడుతున్న ప్రభావాన్ని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లనున్నారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, సర్బానంద సోనోవాల్ వంటి వారితో సీఎం భేటీ కానున్నారు.


ఒకరోజు ముందే సీఎం సమావేశాలు

సమ్మిట్‌కు ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలతో అమరావతి, విశాఖల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. బుధవారం సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్‌తో అమరావతిలో సమావేశమవుతారు. అనంతరం విశాఖ చేరుకుని వివిధ భేటీల్లో పాల్గొంటారు. డబ్ల్యూఐపీవో డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జపాన్ రాయబారి కీచి ఒనో, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ, రెన్యూ సంస్థ సీఈవో సుమంత్ సిన్హాలతో బుధవారమే సమావేశం కానున్నారు. బుధవారం సాయంత్రం సీఐఐ సీఈవోలతో సమావేశం, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన స్వాగత విందులో పాల్గొంటారు.









వేగంగా పంట నష్టాల నమోదు

- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం
- అర్నబ్, మురసు తుపానులతో 4,61,194 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం
- 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం..
- వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుపానుల కారణంగా వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఉదయం ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. అర్నబ్ తుపాను ప్రభావంతో 15 జిల్లాల్లో 10,90,933 హెక్టార్ల సాగు విస్తీర్ణానికి గాను 3,27,843 హెక్టార్లలో (30.05%) పంటనష్టం నమోదైందని, 5,23,136 మంది రైతులు ప్రభావితమయ్యారని అధికారులు వివరించారు. 9,78,091 టన్నుల ఉత్పత్తి నష్టంతో రూ.2,392.84 కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని అంచనా వేసినట్లు తెలిపారు. డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 99.19 శాతం సాగు విస్తీర్ణం దెబ్బతినగా, 94,808 మంది రైతులకు సంబంధించి రూ.348.88 కోట్ల ఆర్థిక నష్టం నమోదైందన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ కింద రూ.815.57 కోట్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కింద రూ.714.96 కోట్లను అంచనా వేసినట్లు తెలిపారు. మురసు తుఫాను ప్రభావంతో 9 జిల్లాల్లో 5,62,445 హెక్టార్ల సాగు విస్తీర్ణానికి గాను 1,33,351 హెక్టార్లలో (23.71%) పంటలు దెబ్బతిన్నాయని, 1,86,269 మంది రైతులు ప్రభావితమయ్యారని అధికారులు వివరించారు. 3,38,302 టన్నుల ఉత్పత్తి నష్టంతో రూ.816.53 కోట్ల ఆర్థిక నష్టం నమోదైందని అంచనా వేసినట్లు తెలిపారు. ఎస్‌డీఆర్ఎఫ్ కింద రూ.321.64 కోట్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కింద రూ.266.67 కోట్లను అంచనా వేసినట్లు తెలిపారు.



అర్నబ్ తుపాను ప్రభావంతో 15 జిల్లాల్లోని 215 మండలాలు, 1,310 గ్రామాల్లో 23,211.48 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతినగా, 58,990 మంది రైతులు ప్రభావితమయ్యారని అధికారులు వివరించారు. ఇప్పటివరకు 58,630 మంది రైతులకు సంబంధించిన 23,035.08 హెక్టార్లలో (99.24%) ఎన్యూమరేషన్ పూర్తయిందని, రాష్ట్రస్థాయి నివేదిక ప్రకారం మరో 176.40 హెక్టార్లలో 360 మంది రైతుల నమోదు పెండింగ్‌లో ఉందని తెలిపారు. మొత్తం 15 జిల్లాల్లో 14 జిల్లాలు నూరు శాతం ఎన్యూమరేషన్ పూర్తిచేయగా, కృష్ణా జిల్లాలో 86.67 శాతం పూర్తయిందన్నారు. మురసు తుపాను ప్రభావంతో 8 జిల్లాల్లోని 106 మండలాలు, 530 గ్రామాల్లో 6,748.52 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతినగా, 12,586 మంది రైతులు ప్రభావితమయ్యారని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 3,392 మంది రైతులకు సంబంధించిన 2,211.73 హెక్టార్లలో (32.77%) మాత్రమే ఎన్యూమరేషన్ పూర్తయిందని, ఇంకా 4,536.79 హెక్టార్లలో 9,194 మంది రైతుల నమోదు పెండింగ్‌లో ఉందని వివరించారు. రెండు తుపానుల వల్ల జరిగిన నష్టాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, ఇంకా నమోదు చేయాల్సిన పంటల విస్తీర్ణం, రైతుల సంఖ్యను జిల్లాలవారీగా గుర్తించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఎన్యూమరేషన్‌ను త్వరితగతిన పూర్తిచేసి, అర్హులైన ఒక్క రైతు కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

11వేల మంది సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాల్లో...

వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వం

- ఉద్యోగులను అన్ని విధాలా దగా చేసిన వైసీపీ ప్రభుత్వం
- వారి ఆత్మగౌరవం నిలబెట్టి, హక్కులు కాపాడుతున్న కూటమి సర్కార్
- స్థానిక ఎన్నికల్లో కూటమికి అండగా నిలిచిన ఉద్యోగులకు కృతజ్ఞతలు
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థాగత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అఖండ విజయాన్ని కట్టబెట్టిన ప్రజలందరికీ, ప్రభుత్వానికి అండగా నిలిచిన ఉద్యోగులకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ముందు అనుకున్నట్లే, స్థానికఎన్నికల్లో ప్రజలుఇచ్చిన తీర్పుకూటమి ప్రభుత్వ పాలనకు లభించిన స్పష్టమైన ప్రజా రెఫరెండం అన్నారు సంపూర్ణ విశ్వాసంతో ఇంతటి అపూర్వమైన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలంద రికీ కూటమి ప్రభుత్వం తరఫున, తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తి గతంగా తన తరఫున శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలు పుకుంటున్నానన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. పొలంలో వ్యవసాయం సాగాలంటే కాడి కింద జోడెద్దులు ఎలా కలిసి సాగాలో, రైతు -రైతుకూలీల అనుబంధం ఎంత ముఖ్యమో... ఒక రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే పాలకులు, ఉద్యోగ యంత్రాంగం అంతే సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. గడచిన రెండున్నరేళ్ల కాలంలో ప్రభుత్వమూ, యంత్రాంగమూ కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన కృషే నేడు స్థానిక సంస్థల ఎన్నికల్లో చారిత్రాత్మక విజయానికి బలమైన పునాదిగా నిలిచింది.ముఖ్యంగా ఈఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఏకంగా 63.6శాతం మంది ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు పలకడం చాలా గర్వకారణం. ప్రభుత్వంపై ఉద్యోగులు ఉంచిన ఈ నమ్మకానికి, ఆదరణకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఉద్యోగుల సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి స్పష్టం చేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఎదుర్కొన్న ఇబ్బందులను, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఉద్యోగ వ్యవస్థ ఏ విధంగా నిర్వీర్యమైందో రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలన్నింటికీ బాగా తెలుసు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో దాదాపు 63.6 శాతం మంది ఉద్యోగులు కూటమి నాయకత్వాన్ని బలపరిచి అండగా నిలిచారు. అయితే, ఇంకా దాదాపు 34 శాతం మంది ఉద్యోగులు ఆ పార్టీ వైపే ఉండటం చూస్తే ఆశ్చర్యమేస్తోంది. గత పాలకులు ఉద్యోగులకు ఏం చేశారని ఇంకా వారికి మద్దతు ఇస్తున్నారో ప్రతి ఒక్కరూ ఒక్కసారి ఆలోచించుకోవాలి. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు దాదాపు రూ.40,000 కోట్ల మేర బకాయిలు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఈఎల్, డీఏ వంటి హక్కులను సైతం సకాలంలో ఇవ్వకుండా నిలిపివేశారు. ఐదేళ్ల పాలనలో మొదటి ఏడాది ఒక్క జనవరి నెల మినహాయిస్తే, మిగతా కాలమంతా ప్రతి నెలా ఏ తారీఖున జీతాలు వస్తాయో తెలియని దుస్థితిని కల్పించారు. ఆర్థికంగా ఎంతో బలంగా ఉన్న తెలంగాణ ప్రభుత్వం గతంలో 42 శాతం ఫిట్‌మెంట్ ఇస్తే, 2014-19 మధ్య రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ఉద్యోగులను గౌరవించారు. కానీ 2019-24లో వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 'రివర్స్ పీఆర్సీ' తెచ్చి, మధ్యంతర భృతి 27 శాతం ఉంటే ఫిట్‌మెంట్‌ను ఏకంగా 23 శాతానికి తగ్గించింది. హెచ్ఆర్ఏ కోత విధించడమే కాకుండా, ఉద్యోగుల పీఎఫ్ నిధులను, డ్వాక్రా సంఘాల ఇన్సూరెన్స్ సొమ్మును, కార్మిక సంక్షేమ నిధులను సైతం దారిమళ్లించి వాడేసుకుంది. రాష్ట్ర విభజన సమయంలో రూ.16,000 కోట్ల లోటు బడ్జెట్‌తో ఉన్న పరిస్థితుల్లోనే 2014 నుంచి 2019 వరకు ప్రతి నెలా 1వ తారీఖునే జీతాలు చెల్లించిన ట్రాక్ రికార్డు చంద్రబాబుది. ఇప్పుడు ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా ఉద్యోగుల శ్రేయస్సుకే అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన దాదాపు రూ.30,000 కోట్ల బకాయిలను ఉద్యోగులకు చెల్లించి వారికి ఆర్థిక భరోసా కల్పించాం. దేశంలో ఉన్న రాష్ట్రాలన్నింటిలో ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటంలో ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ముందంజలో ఉంటుంది. సీపీఎస్ విధానానికి సంబంధించిన ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను పక్కాగా జమ చేస్తూ, ఉద్యోగుల శ్రేయస్సులో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిన ఏకైక ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వం. ఈ వాస్తవాలను ఉద్యోగులందరూ గమనించాలి. ఉద్యోగుల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి సంపూర్ణంగా కట్టుబడి పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తులోనూ అందరూ చేదోడువాదోడుగా నిలవాలని ఎమ్మెల్సీ ఆలపాటి కోరారు.

ఉద్యోగుల హక్కులను నెరవేరుస్తున్నది కూటమి ప్రభుత్వమే

2004, సెప్టెంబర్ 1వ తేదీ ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి సుప్రీంకోర్టు తీర్పు, కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించినా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీపీఎ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మొసలి కన్నీరు కార్చిందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మండిపడ్డారు. కానీ, కూటమి ప్రభుత్వం రాగానే ఇది అత్యంత న్యాయమైన అంశమని గుర్తించి, వెంటనే జీపీఎ విడుదల చేసి ఏకంగా 10,715 మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పరిధిలోకి తీసుకొచ్చిన ఘనత మా ప్రభుత్వానిదే. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 60 ఏళ్లకు, అనంతరం 62 ఏళ్లకు పెంచి అన్ని కార్పొరేషన్ల ఉద్యోగులకూ వర్తింపజేశాం. అంతేకాకుండా 'నిధి' పోర్టల్‌ను ఏర్పాటు చేసి ఓపీఎస్ పరిధిలోకి వచ్చిన ఉద్యోగులందరినీ, అప్పటికే రిటైర్ అయిన వారిని కూడా అందులో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించి పూర్తి రక్షణ కల్పించాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జీవో ఎంఎస్ నెం. 107, 121 ద్వారా సీపీఎస్ ఉద్యోగులకు 2017లోనే ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ సౌకర్యాన్ని కల్పించాం. 2024 నుంచి 2027 వరకు ఉద్యోగులకు రావాల్సిన డీఏలను 16 విడతల్లో పద్ధతి ప్రకారం చెల్లిస్తున్నాం. అదే గత ప్రభుత్వంలో 19 నెలల కాలానికి కేవలం ఒకే డీఏ ఇచ్చి, ఆ బకాయిలను కూడా మూడు విడతల్లో ఎప్పుడో ఇస్తామంటూ జీవో విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. 10వ పీఆర్సీ బకాయిల కింద రూ.50,000, పీఎఫ్ ద్వారా రూ.50,000 నుంచి రూ.2 లక్షల వరకు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది. గత ఎన్నికల ముందు 12వ పీఆర్సీ కేవలం ఒక నామమాత్రపు ప్రకటనకే వైసీపీ ప్రభుత్వం పరిమితం చేసింది. గతంలో ఇవ్వాల్సిన బకాయిల గురించి కనీసం ఒక్క మాట కూడా మాట్లాడకుండా తప్పించుకున్న మోసపూరిత మనస్తత్వం వైసీపీది. రివర్స్ పీఆర్సీతో జీతాలు తగ్గించి, హెచ్ఆర్ఏ కోత విధించి, రావాల్సిన గ్రాట్యుటీ, పీఎఫ్ నిధులను సైతం పక్కదారి పట్టించి ఉద్యోగులను అన్ని విధాలా దగా చేశారు. అన్నింటికంటే దారుణంగా... కోవిడ్ సంక్షోభ సమయంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద క్యూ లైన్లను నియంత్రించడానికి వాడి తీవ్ర అవమానాలకు గురిచేసిన దుర్మార్గమైన చరిత్ర ఆ పాలకులది. ఇలాంటి అవమానాల నుంచి ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారి సమస్యలను పరిష్కరిస్తున్నది మన కూటమి ప్రభుత్వం. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రగతి కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పాలకులు, ఉద్యోగులు కలిసి పనిచేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. కూటమి నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసంతో ఎన్నికల్లో 63.6 శాతం మెజారిటీ పోస్టల్ బ్యాలెట్లతో అండగా నిలిచిన ఉద్యోగ సోదరులందరికీ మరొక్కసారి నా హృదయపూర్వక ధన్యవాదాలు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించేందుకు ఉద్యోగులందరూ ఇలాగే తమ పూర్తి సహకారాన్ని అందించాలని ఎమ్మెల్సీ ఆలపాటి విజ్ఞప్తి చేశారు.

ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలి

- లలిత్‌బాబు అంతర్జాతీయ చెస్ టైటిళ్లపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ముసలప్పగారి రాహుల్ లలిత్ బాబు చెస్ క్రీడలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలని రాష్ట్ర గనులు,భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. యూరప్ గడ్డపై వరుస అంతర్జాతీయ చెస్ టైటిళ్లతో సరికొత్తచరిత్ర సృష్టించిన లలిత్ బాబు మంగళవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలివారు. తాను సాధించిన ప్రతిష్టాత్మక ట్రోఫీలను మంత్రికి చూపించి తన విజయ ప్రస్థానాన్ని వివరించారు.ఈసందర్భంగా లలిత్ బాబు మాట్లాడుతూ, జర్మనీలో జరిగిన 43వ మున్‌స్టర్‌ల్యాండ్ చెస్ ఓపెన్, స్పెయిన్‌లో జరిగిన బెనిడోర్మ్ చెస్ ఓపెన్ 2026 టోర్నమెంట్‌లలో ఛాంపియన్‌గా నిలిచినట్లు మంత్రికి తెలిపారు. ముఖ్యంగా, రెండు టోర్నీల ఫైనల్ రౌండ్లలో అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్లపై నల్ల పావులతో ఆడి, ఒత్తిడిని అధిగమించి సాధించిన క్లచ్ విజయాలను ప్రస్తావించారు. సుదీర్ఘ ప్రయాణాలు, కఠినమైన పోటీ ఉన్నప్పటికీ దేశానికి, రాష్ట్రానికి కీర్తి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.

లలిత్ విజయాలపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. లలిత్ బాబును ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న క్రీడాకారులకు ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

భవిష్యత్తులో ప్రపంచ టాప్ ర్యాంకింగ్స్‌లోకి దూసుకెళ్లాలనే లలిత్ బాబు ఆశయానికి ప్రభుత్వం నుండి తగిన సహకారం అందిస్తామని సూచించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని, మరింత మందిని క్రీడల్లోకి వచ్చేలా ప్రోత్సహించాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

ఉన్నత స్థాయిలో పేద విద్యార్థులు

- అదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- విజయవాడ అంబేద్కర్ స్టడీ సర్కిల్లో మంత్రి ఆకస్మిక తనిఖీ



విజయవాడ (చైతన్యరథం): పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. విజయవాడలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను మంత్రి డిఎస్ బీవీ స్వామి మంగళవారం నాడు ఆకస్మిక తనిఖీ చేశారు. కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులను సౌకర్యాల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. పేద పిల్లలకు నాణ్యమైన ఉన్నత స్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యం అందించి వారిని ఉన్నత స్థాయిలో ఉంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. తిరుపతి, విజయవాడ,విశాఖ అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో సివిల్స్ కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు సివిల్స్ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నామని, మరి కొంత మందికి ట్యాబ్ లు ఇచ్చి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పిస్తున్నామని మంత్రి తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, ఇజ్రాయెల్ భాషల్లో శిక్షణ ఇచ్చి ఆ దేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పేద విద్యార్థులు, యువత అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకొని ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని మంత్రి డోలా ఆకాంక్షించారు.

ఏపీకి పెట్టుబడుల వెల్లువ

- నాడు పారిశ్రామికవేత్తలను భయపెట్టి తరిమేసిన జగన్
- నేడు పెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్ వేస్తున్న కూటమి ప్రభుత్వం
- సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసకర విధానాలు, పారిశ్రామిక వేత్తలను వేధించడం,పెట్టుబడిదారుల్లో నమ్మకం కోల్పోయేలా చేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా తీవ్రంగా నష్టపోయిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. గతంలో ఏపీకి రావాలంటేనే భయపడిన పారిశ్రామికవేత్తలు నేడు కూటమి ప్రభుత్వ విధానాలు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నారన్నారు. రాష్ట్రంలో మారిన పారిశ్రామిక వాతావరణానికి ఇదే నిదర్శనం. జగన్ ఐదేళ్ల పాలనలో నిర్వహించింది కేవలం ఒకే ఒక్క పెట్టుబడుల సదస్సు మాత్రమే. కానీ కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రెండుసార్లు సీఐఐ భాగస్వామ్య సదస్సులను విజయవంతం గా నిర్వహించి రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించింది.దేశంలోనే అత్యుత్తమమైన 28పారిశ్రామిక విధానాలను తీసుకొచ్చి, పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను స్వర్గధామంగా తీర్చిదిద్దుతోంది. రాష్ట్ర యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమిప్రభుత్వం పనిచేస్తోంది.ఇప్పటికే 8 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన దిశగా ముందడుగువేసింది.ప్రతినెలా ఒకభారీ పరిశ్రమ రాక, భూమిపూజ..ప్రారంభోత్సవం జరుగుతుండటం రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి వేగానికి నిదర్శనం. సీఐఐ ప్రాంతీయ సదస్సుల ద్వారా మరో 1.50లక్షల ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమమవుతోంది. తాజాగా విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ సదస్సు ద్వారా మరిన్ని భారీ పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉత్తరాంధ్ర పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం నుంచి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను తరిమివేశారు. కానీ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే రూ.26లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఈగణాంకాలే గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, పెట్టుబడిదారులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక రాష్ట్రంగా నిలబెట్టే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని మంగళవారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే గంటా పేర్కొన్నారు.

తుపానుల్లో దెబ్బతిన్న రైతులందరినీ ఆదుకోవాలి

- ఎర్రకాలువ వరద ముంపు బాధితులకు అండగా నిలవాలి
- కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబుకి నిడదవోలు రైతుల కష్టాలు వివరించిన మంత్రి దుర్గేష్



నిడదవోలు (చైతన్యరథం): వరుసగా విరుచుకుపడిన ‘అర్నబ్’, ‘మురసు’ తుపాన్ల దాటికి తూర్పు గోదావరి జిల్లాతో పాటు ప్రత్యేకించి నిడదవోలు నియోజకవర్గ రైతాంగం తీవ్రంగా దెబ్బతిని ఆవేదనలో ఉందని సీఎం చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. అమరావతిలో మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రైతుల కష్టాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. తుపాన్ల ఉధృతికి తోడు ఎర్రకాలువ పొంగిపొర్లడంతో సమీప గ్రామాలు జలమయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట చేలు పూర్తిగా నాశనమై రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని తెలిపారు. ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరి ప్రజల జనజీవనం స్తంభించిపోయిందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పంట ఇన్సూరెన్స్ కొద్దిమందికే ఉన్నందున, ఇన్సూరెన్స్ లేని రైతులను కూడా మానవీయ కోణంలో పరిగణనలోకి తీసుకుని నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకూ ప్రభుత్వ పరిహారం అందించాలని విన్నవించారు. తుపాను తో పాటు ఎర్రకాలువ వరద వల్ల దెబ్బతిన్న పంటలు, ఇళ్ల నష్టాన్ని తక్షణమే అంచనా వేసి (ఎన్యుమరేషన్), నిబంధనలకు అతీతంగా అర్హులైన ప్రతి రైతునూ జాబితాలో చేర్చాలని కోరారు.. నిడదవోలు నియోజకవర్గ రైతాంగాన్ని, ప్రజలను అన్ని విధాలా ఆదుకుని కొండంత అండగా నిలవాలని విజ్ఞప్తి చేయగా దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో సానుకూలంగా స్పందించారని మంత్రి దుర్గేష్ తెలిపారు.

తెలుగు భాషకు వెలుగుబాట సీపీ బ్రౌన్

- జయంతి సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ నివాళి

అమరావతి (చైతన్యరథంజ): తెలుగు సాహిత్య వికాసానికి విశేష సేవలు అందించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సీపీ బ్రౌన్) జయంతి సందర్భంగా మంగళవారం మంత్రి కందుల దుర్గేష్ ఘన నివాళులు అర్పించారు. విదేశీయుడైనప్పటికీ తెలుగును మాతృభాషగా ప్రేమించి, దాని వ్యాప్తికి బ్రౌన్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. తెలుగులో తొలి ప్రామాణిక నిఘంటువును రూపొందించి, నేటికీ ప్రామాణికంగా నిలిచేలా చేసిన మహనీయుడు బ్రౌన్ అన్నారు. ప్రాచీన తెలుగు కావ్యాలను సేకరించి వాటిని భావితరాలకు దానం చేసిన “సాహితీ కర్ణుడు”గా అభివర్ణించారు. సీపీ బ్రౌన్ చూపిన బాటలో మన మాతృభాష తెలుగు గొప్పదనాన్ని, దాని సాహితీ సంపదను పరిరక్షించుకోవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.



నైపుణ్య శిక్షణతో ఎస్సీ యువతకు ఉపాధి

- సీఎం చంద్రబాబు సంకల్పం
- ఎస్సీ ఫిమేల్ నర్సింగ్ విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ
- శిక్షణ అనంతరం ఇజ్రాయెల్ లో నెలకు రూ.2 లక్షల వేతనంతో ఉపాధి కల్పన
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- విజయవాడలో ఇజ్రాయిల్ నర్సింగ్ ట్రైనింగ్ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి



విజయవాడ (చైతన్యరథం): ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఇజ్రాయెల్ నర్సింగ్ ట్రైనింగ్ వర్క్ షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి డా.స్వామి మాట్లాడుతూ... పీఎం ఏజెఏవై కార్యక్రమంలో భాగంగా ఏపీ ఎస్సీ కార్పొరేషన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో ఏఎన్ఎం/జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఎస్సీ మహిళలకు 3 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విశాఖ, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా తొలి విడతగా 1100 మందికి శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ అనంతరం ఇజ్రాయెల్‌లో నెలకు రూ.2 లక్షల వేతనంతో ఉపాధి కల్పించనున్నట్టు మంత్రి తెలిపారు. ఇప్పటికే జర్మన్ భాషలో 300 మందికి శిక్షణ ఇచ్చామని, వారికి జర్మనీలో ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు గ్రూప్స్‌తో పాటు డీఎస్సీ, ఆర్ఆర్ బీ, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. డీఎస్సీ ఉచిత శిక్షణతో 400 మంది ఉద్యోగాలు సాధించారని మంత్రి అన్నారు. ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. పేద ప్రజల తలసరి ఆదాయం పెరిగి రాష్ట్రంలో పేదరికం ఉండకూడదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని అందుకనుగుణంగా సాంఘిక సంక్షేమ శాఖ పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు.ఎస్సీ విద్యార్థులు, నిరుద్యోగ యువతను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తూ అండగా ఉంటోందన్నారు. అర్హులైన వారు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాల్ని అందిపుచ్చుకుని జీవితంలో స్థిరపడాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పి. విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి తేజ్ భరత్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు, ఎస్సీ కార్పొరేషన్ జీఎం చెన్నయ్య, అన్ని జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు, నర్సింగ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ మందుల ధరల తగ్గింపు ప్రయోజనం ప్రతి రోగికీ చేరాలి

- నిల్వలో ఉన్న మందులు కూడా తగ్గింపు ధరలకే
- ఔషధ దుకాణాల్లో తగ్గించిన ధరల జాబితా
- కొరత సృష్టించేవారిపై కఠిన చర్యలు
- మందుల నిల్వలు, కొనుగోళ్లపై నిరంతర పర్యవేక్షణ
- అధికారులకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు
- ఆసుపత్రులు, మందుల దుకాణాలకు విధివిధానాల జారీ



అమరావతి (చైతన్యరథం): క్యాన్సర్ మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిన నేపథ్యంలో ఆ ప్రయోజనం రోగులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. మందుల లభ్యత, ధరల నియంత్రణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. పాత ధరలతో ముద్రించిన మందుల నిల్వలను సైతం తగ్గించిన ధరలకే విక్రయించాలని పేర్కొన్నారు. అధిక ధరలకు విక్రయించడం, మందుల కొరత సృష్టించడం, అవసరానికి మించి నిల్వలు ఉంచడం వంటి అక్రమాలను అరికట్టాలని ఆదేశించారు.

దేశవ్యాప్తంగా 1364 క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలను సోమవారం నుంచి కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. 671 బ్రాండ్ల ధరల్లో 50 శాతం కంటే ఎక్కువ తగ్గింది. ఎంఆర్‌పీలో అత్యధికంగా 96.45 శాతం వరకు తగ్గింపు జరిగింది. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన ఈ క్యాన్సర్ మందుల ధరల అమలుకు తగ్గట్లు రాష్ట్రంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం కార్యదర్శి జి.వీరపాండియన్, ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో ఇప్పటికే ఉన్న క్యాన్సర్ మందులను కూడా తగ్గించిన ధరలకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మందుల కొరత సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

అవసరాలకు తగ్గట్టే మందుల కొనుగోలు

క్యాన్సర్ చికిత్స అందించే ఆసుపత్రులు రోగులకు సూచించిన మందులను తగినంతగా అందుబాటులో ఉంచాలని మంత్రి చెప్పారు. ప్రతి ఔషధానికి తగ్గించిన ధరతో కనీసం ఒక కంపెనీ మందు నిల్వ ఉండేలా చూడాలన్నారు. రోగులు తమ అవసరాలకు అనుగుణంగానే మందులను కొనుగోలు చేయాలని సూచించారు. అవసరానికి మించి భారీగా మందులు కొనుగోలు చేసి నిల్వ చేయడం వల్ల ఇతర ఆసుపత్రులు, రోగులకు మందులు అందకుండా పోతాయని పేర్కొన్నారు.

మరోవైపు, ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు జిల్లాలకు జారీ చేసిన విధివిధానాల్లో తగ్గించిన క్యాన్సర్ మందుల విక్రయాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వెనక్కి పంపాల్సిన అవసరం లేదు

ఆసుపత్రుల మందుల విక్రయ కేంద్రాల్లో, వెబ్‌సైట్లలో తయారీ కంపెనీలు పంపిన సవరించిన ధరల జాబితాను ప్రదర్శించాలి. పాత ధర ముద్రించిన మందుల ప్యాకెట్లను తిరిగి పంపాల్సిన అవసరం లేదు. వాటిపై కొత్త ధర ముద్రించాల్సిన అవసరమూ లేదు.

అయితే సవరించిన ధర లేదా ప్యాకెట్‌పై ముద్రించిన ధర.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ ధరకు మాత్రమే విక్రయించాలి. ప్రతి మందుకు సంబంధించిన బ్రాండ్ పేరు, బ్యాచ్ సంఖ్య, గరిష్ఠ చిల్లర ధర, వసూలు చేసిన మొత్తం వివరాలతో కూడిన బిల్లును రోగులకు ఇవ్వాలి. ఆసుపత్రుల మందుల విక్రయ కేంద్రాలు, క్యాన్సర్ చికిత్స విభాగాలు, డే కేర్ క్లినిక్‌లలో రోగుల హక్కులు, ఫిర్యాదుల విధానాన్ని తెలుగులో, ఆంగ్లంలో ప్రదర్శించాలి.

ఆసుపత్రుల తనిఖీలు

ప్రతి ఔషధ తనిఖీ అధికారి తన పరిధిలోని అన్ని క్యాన్సర్ ఆసుపత్రులు, చికిత్స కేంద్రాలను ఏడు రోజుల్లో తనిఖీ చేయాలి. ఆసుపత్రుల్లో సాధారణంగా వినియోగించే క్యాన్సర్ మందులు తగ్గించిన ధరలకు అందుబాటులో ఉన్నాయా, ప్రతి ఔషధానికి కనీసం ఒక కంపెనీ మందు నిల్వ ఉందా, ధరల జాబితా ప్రదర్శిస్తున్నారా అనే అంశాలను పరిశీలించాలి.

నవంబరు 9 నుంచి తగ్గించిన ధరలకు మందులు విక్రయిస్తున్నారా లేదా తెలుసుకునేందుకు ప్రతి ఔషధానికి సంబంధించి ఇటీవల జారీ చేసిన బిల్లులను పరిశీలించాలి. పాత ధరలతో ముద్రించిన ప్యాకెట్లలో ఉన్న మందులను సైతం తగ్గించిన ధరలకే విక్రయిస్తున్నారా అనేది నిర్ధారించాలి.

సరఫరా ఏజెంట్ల వద్ద ధరల జాబితాల పరిశీలన

తయారీ కంపెనీల సరఫరా ఏజెంట్లు, సూపర్ స్టాకిస్టుల వద్ద ఔషధాల సవరించిన ధరల జాబితా అందిందా లేదా అనేది ఔషధ తనిఖీ అధికారులు పరిశీలించాలి. నవంబరు 9 నుంచి జారీ చేసిన బిల్లుల్లో తగ్గించిన ధరలు నమోదు చేశారా, ఆ తేదీ నాటి నిల్వలు, ప్రస్తుత నిల్వలు ఎంత ఉన్నాయనే వివరాలను తనిఖీ చేయాలి. ప్రస్తుత ధరల జాబితాలోని ధర లేదా ప్యాకెట్‌పై ముద్రించిన ధర.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే దానికి అనుగుణంగా విక్రయాలు జరగాలి. అధిక ధర వసూలు చేయకూడదు.

24 గంటల్లో చర్యలు

ఆసుపత్రి, రోగి లేదా వారి సహాయకుల నుంచి మందులు అందుబాటులో లేవని ఫిర్యాదు వస్తే ఔషధ తనిఖీ అధికారి 24 గంటల్లో స్పందించాలి. జిల్లా సరఫరాదారుల జాబితా ద్వారా మందుల నిల్వ ఎక్కడ ఉందో గుర్తించి, ఆసుపత్రి లేదా రోగికి మందులు అందేలా చర్యలు తీసుకోవాలి.

అక్రమాలపై చట్టపరమైన చర్యలు

తగ్గించిన ధరల కంటే అధికంగా మందులు విక్రయిస్తే బిల్లులు, రికార్డులను సంబంధిత అధికారి స్వాధీనం చేసుకోవాలి. మందుల ధరల జాబితాను ప్రదర్శించకపోతే 24 గంటల్లో నిబంధనలు పాటించాలని లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వాలి. మందుల విక్రయాన్ని నిలిపివేయడం లేదా నిరాకరించడం వంటి సందర్భాల్లో ఫిర్యాదుదారు, వ్యాపారి వాంగ్మూలాలను నమోదు చేయాలి. అనుమతి లేని వ్యక్తులకు మందులు విక్రయించడం వంటి ఉల్లంఘనలపై నోటీసులు జారీ చేయాలి. జిల్లా సహాయ సంచాలకులు తమ పరిధిలో వ్యక్తిగతంగా పర్యవేక్షించాలి. క్యాన్సర్ ఆసుపత్రుల సంఖ్య, తనిఖీలు, సరఫరా ఏజెంట్లు, సూపర్ స్టాకిస్టుల వద్ద ధరల జాబితాల పరిశీలన, మందుల లభ్యతపై వచ్చిన ఫిర్యాదులు, 24 గంటల్లో పరిష్కరించిన ఫిర్యాదులు, అసాధారణ కొనుగోళ్లు, అధిక ధరల విక్రయాలు, విక్రయ నిరాకరణలు, అనుమతుల నిలిపివేత లేదా న్యాయ చర్యల వివరాలతో నివేదిక రూపొందించాలి.

ఫిర్యాదులు చేయాలంటే...

క్యాన్సర్ మందులు అందుబాటులో లేక పోయినా, తగ్గించిన ధర కంటే అధికంగా వసూలు చేసినా, మందులు ఇవ్వడానికి నిరా కరించినా రోగులు, ఆసుపత్రుల వారు ఔషధ నియంత్రణ శాఖకు ఫిర్యాదు చేయవచ్చని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఔషధ నియంత్రణశాఖ వాట్సాప్: 8632330909, ఈ-మెయిల్: dca-grams@ap.gov.in, ఎన్‌పీపీఏ టోల్‌ఫ్రీ నంబరు: 1800-111-255

తండ్రి పేరు తప్పనిసరి నిబంధన తొలగించాలి

- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

విజయవాడ (చైతన్యరథం): ప్రభుత్వ శాఖల దరఖాస్తులు, అధికారిక రికార్డులు, ధ్రువీకరణ పత్రాల్లో చట్టపరంగా తప్పనిసరి కాని సందర్భాల్లో తండ్రి పేరు నమోదు చేయాలనే నిబంధనను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సూచించారు. తండ్రి పేరు లేదనే కారణంతో ఏ చిన్నారికీ విద్య, గుర్తింపు పత్రాలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవలు దూరం కాకూడని స్పష్టం చేశారు.

విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్‌లో మంగళవారం చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యశాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ.. కుటుంబ పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి చిన్నారికి సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ దరఖాస్తుల్లో తండ్రి పేరు తప్పనిసరి చేయడం వల్ల ఒంటరి తల్లులు, అవివాహిత మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, చట్టబద్ధ సంరక్షకుల వద్ద పెరుగుతున్న పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తండ్రి



వివరాలు లేవనే కారణంతో పిల్లల విద్య, భవిష్యత్తుకు ఆటంకం కలగకూడదని, చట్టపరంగా అవసరం లేని చోట తల్లి లేదా చట్టబద్ధ సంరక్షకుల పేరును ప్రత్యామ్నాయంగా అనుమతించాలని సూచించారు.

ఈ అంశంపై సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమన్వయంతో పనిచేయాలని కోరారు. అన్ని శాఖల్లో ఒకే విధమైన విధానాన్ని అమలు చేసేందుకు సమగ్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ దరఖాస్తులు, ఆన్ లైన్ పోర్టల్లలో అవసరమైన మార్పులు చేపట్టి, క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని తెలిపారు. పిల్లల కుటుంబ పరిస్థితుల గురించి పదేపదే ప్రశ్నించడం వల్ల వారిలో మానసిక ఆందోళన, అవమాన భావన కలగకుండా చూడాలని,వారి వ్యక్తిగత గోప్యత, గౌరవాన్ని కాపాడాలని పేర్కొన్నారు.

ఈ కార్యశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ..ప్రతి చిన్నారికి స్వతంత్ర హక్కులు, గుర్తింపు ఉంటాయని, తల్లిదండ్రుల వైవాహిక స్థితి లేదా కుటుంబ పరిస్థితుల ఆధారంగా పిల్లల భవిష్యత్తును నిర్ణయించకూడదన్నారు. తండ్రి పేరు తప్పనిసరి కాని చోట ఆనిబంధనను తొలగించి, తల్లి లేదా చట్టబద్ధ సంరక్షకుల వివరాలను అనుమతించాలని సూచించారు. పాఠశాల ప్రవేశాలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలు, గుర్తింపు పత్రాల జారీలో తండ్రి పేరు లేదనే కారణంతో ఎలాంటి సేవలను నిరాక రించకూడదన్నారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో బాలల హిత విధానాలను అమలు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.కె. విజయలక్ష్మి, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామారావు, జువైనల్ వెల్ఫేర్ శాఖ అధికారులు, ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారు లు, పాఠశాల విద్యాశాఖ అధికారులు, వివిధ జిల్లాల బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ వేదికగా విశ్వ పెట్టుబడుల పండుగ!

మొన్నటి వరకు అవకాశాల కోసం ఎదురు చూసిన ఆంధ్రప్రదేశ్ నేడు ప్రపంచ పెట్టుబడులను ఆహ్వానించే స్థాయికి ఎదిగింది. ప్రపంచ పారిశ్రామిక పటంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక స్థానం కల్పించాలన్న సంకల్పం సీఎం చంద్రబాబుది. పొడవైన సముద్ర తీరపు సహజ సంపద, అపారమైన మానవ వనరులు, విస్తృతమైన భూమి, పారిశ్రామిక అనుకూల వాతావరణం. వీటన్నింటినీ అభివృద్ధికి చోదకశక్తులుగా మలచాలన్న సీఎం చంద్రబాబు దార్శనికతకు విశాఖ వేదికగా జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నిదర్శనం. ప్రపంచ దేశాల చూపును విశాఖ వైపు తిప్పనున్న ఈ సదస్సు నవ్యాంధ్ర పారిశ్రామిక పునర్వైభవానికి నాంది పలకనుంది. విశాఖ తీరాన జరుగుతున్న ఈ సీఐఐ భాగస్వామ్య సదస్సు నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థిక పునర్నిర్మాణంలో ఒక కీలక మలుపు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు, అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొంటున్న పోటీ, పెట్టుబడుల కోసం దేశాల మధ్య సాగుతున్న ప్రయత్నాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మరోసారి ప్రపంచ పారిశ్రామిక రంగం దృష్టిని ఆకర్షించేందుకు సిద్ధమైంది. ఈ నెల 12-13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సును కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్నది. 1995 నుంచి నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీ, భారత పరిశ్రమల సమాఖ్య -సీఐఐ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సులో అంతర్జాతీయ ప్రతినిధులు, వివిధ దేశాల మంత్రులు, పారిశ్రామికవేత్తలు, ప్రపంచ స్థాయి సంస్థల ప్రతినిధులు పాల్గొన నున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 59 దేశాల ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ ప్రముఖులు, 900 మంది దేశీయ ప్రతినిధులు హాజరయ్యే అవకాశముంది. ఈ సదస్సులో 400 కు పైగా బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు జరగనున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నదుల అనుసందాన కార్యమాన్ని సదస్సులో ప్రత్యేకంగా చర్చించనున్నారు. సదస్సు ప్రారంభం రోజున కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఇతర కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్, ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్ నాయుడు, ముగింపు కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరు కానున్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యత!

పెట్టుబడులు వస్తే పరిశ్రమలు ఏర్పడతాయి. పరిశ్రమలు ఏర్పడితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. స్థానిక వ్యాపారాలు, రవాణా, నిర్మాణం, సేవారంగం, చిన్నతరహా పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయి. ఈ సదస్సును కేవలం ఎంవోయూల సంతకాల కార్యక్రమంగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోసే వేదికగా చూడాలి. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడంపై చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రాధాన్యత ఇవ్వగా ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. పరిశ్రమలకు అవసరమైన అనుమతులు వేగంగా ఇవ్వడం, అనవసరమైన విధానపరమైన అడ్డంకులను తొలగించడం, పెట్టుబడిదారులకు ఇచ్చిన ప్రోత్సాహకాలను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా అందించడం వంటి సంస్కరణలను అమలు చేస్తోంది. ఇది పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచే చర్య. పరిశ్రమలు స్థాపించాలనుకునే సంస్థలకు కేవలం రాయితీలు మాత్రమే ముఖ్యం కాదు. ప్రభుత్వ నిర్ణయాల్లో స్థిరత్వం, అనుమతుల్లో వేగం, విధానాల్లో పారదర్శకత, పెట్టుబడులకు భద్రత కూడా అంతే ముఖ్యం.

కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్లు, అభవృద్ధి!

ఈ సదస్సులో ఆరు ప్రధాన అంశాలపై చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం, పెట్టుబడులు, గ్లోబల్ వాల్యూ చైన్స్ , అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు, విదేశీ పెట్టుబడులు, ఉత్పత్తి-సరఫరావ్యవస్థల్లో భారత్ పాత్ర పెంపు. విశ్వాసం, భౌగోళిక ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ సహకారం, దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యాలు, పెట్టుబడుల భద్రత, ఆర్థిక సంబంధాల బలోపేతం. సాంకేతికత, ఆవిష్కరణలు, భవిష్యత్ పరిశ్రమలు, కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్లు, డిజిటల్ రంగాల అభివృద్ధి. ప్రతిభ, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు, శుద్ధ ఇంధనం, సుస్థిర అభివృద్ధి: పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, ఇంధన నిల్వ సాంకేతికత, వ్యవసాయం, ఆహార భద్రత, బయో ఎకానమీ, ఆధునిక వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు. ఈ అంశాలన్నీ ప్రపంచ పారిశ్రామిక రంగంలో ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత కలిగినవే. విశాఖపట్నానికి ఉన్న సహజమైన భౌగోళిక అనుకూలతలు రాష్ట్రానికి పెద్ద ఆస్తి. సముద్రతీరం, ప్రధాన నౌకాశ్రయం, విమానాశ్రయం, రైల్వే కనెక్టివిటీ, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రాంతాలు..ఇవన్నీ పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పించనున్నాయి. ప్రపంచ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయాలనుకునే సంస్థలకు పోర్టులు అత్యంత కీలకం. ముడిసరుకు దిగుమతి, తయారైన వస్తువుల ఎగుమతి, రవాణా వ్యయాల తగ్గింపు వంటి అంశాల్లో విశాఖకు ప్రత్యేక ప్రయోజనాలున్నాయి.

సుదీర్ఘ సముద్రతీరం గొప్ప వరం!

విశాఖను కేవలం ఓడరేవు నగరంగా కాకుండా ఆధునిక సాంకేతికత, భారీ పరిశ్రమలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. విశాఖలో ఏఐ కేంద్రం, భారీ డేటా సెంటర్లు, స్టీల్ సిటీ వంటి ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. రామాయపట్నంలో పెట్రోకెమికల్ కాంప్లెక్స్ అభివృద్ధి, కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, డేటా సెంటర్లు, గ్రీన్ హైడ్రోజన్, రక్షణ రంగ తయారీ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ కూడా ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. విశాఖలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి జరిగితే ప్రపంచ ఐటీ సంస్థలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్తు, ఫైబర్ కనెక్టివిటీ, నీటి వనరుల సమర్థ నిర్వహణ కూడా కీలకం. వ్యవసాయం, ఉద్యానవనాలు, ఆక్వా ఉత్పత్తుల్లో రాష్ట్రానికి ఉన్న బలాన్ని ఆధునిక ప్రాసెసింగ్ యూనిట్లుగా మార్చగలిగితే రైతులకు మెరుగైన ధరలు, యువతకు ఉద్యోగాలు, విదేశీ మారకద్రవ్య ఆదాయం పెరుగుతాయి.ఆంధ్రప్రదేశ్‌కు సుమారు 974 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరం ఉండటం పెట్టుబడుల పరంగా ఒక గొప్ప వరం. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పోర్టులతోపాటు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

పెట్టుబడులకు అనుకూలతలను ప్రపంచానికి వివరించనున్నది!

రాయలసీమలో ఉద్యానవన హబ్, కోస్తా జిల్లాల్లో ఆక్వా ప్రాసెసింగ్, గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్, ఉత్తరాంధ్రలో సముద్ర ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చెందితే ప్రాంతాల వారీగా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రపంచ పారిశ్రామిక సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందు అనేక అంశాలను పరిశీలిస్తారు. భూమి లభ్యత, విద్యుత్తు సరఫరా, నీటి వనరులు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, రవాణా సౌకర్యాలు, పన్నుల విధానం, ప్రభుత్వ సహకారం వంటి అంశాలు ప్రభావితం చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకున్న అనుకూలతలను విశాఖ సదస్సులో ప్రపంచానికి వివరించనున్నది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం, అనుమతులను వేగంగా మంజూరు చేయడం, పరిశ్రమల సమస్యలను తక్షణమే పరిష్కరించడం ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచనున్నది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన అనేక పారిశ్రామిక పెట్టుబడులకు మళ్లీ జీవం పోసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యానికి ఈ సదస్సు ఒక ముఖ్యమైన అవకాశం. సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, యూరప్, అమెరికా వంటి దేశాల పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌లోని అవకాశాలను వివరించి అంతర్జాతీయ పెట్టుబడులను సాధించి, సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఔషధాలు, పునరుత్పాదక ఇంధనం, ఆహార శుద్ధి రంగాల్లో విదేశీ సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూర్చాలని చంద్రబాబు తపన. రాష్ట్రానికి అవసరమైన జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, విద్యుత్తు మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తే పెట్టుబడుల అమలు మరింత వేగవంతమవుతుంది.

పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ !

రాష్ట్ర విభజనతో ఎదురైన ఆర్థిక, మౌలిక సదుపాయాల సవాళ్లను అధిగమించి, అమరావతిని రాజధానిగా నిర్మించడంతోపాటు విశాఖను సాంకేతిక, పారిశ్రామిక కేంద్రంగా, రాయలసీమను ఉద్యానవన, తయారీ రంగాల కేంద్రంగా, కోస్తా ప్రాంతాన్ని పోర్టులు, సముద్ర ఆధారిత పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యం. 12, 13 తేదీల్లో విశాఖకు తరలివచ్చే ప్రపంచ పారిశ్రామిక ప్రతినిధులకు రాష్ట్రం తన సామర్థ్యాన్ని, అవకాశాలను సమర్థవంతంగా వివరించి ప్రపంచ పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ ఒక విశ్వసనీయ భాగస్వామి అనే నమ్మకాన్ని కలిగించాలి. విశాఖ వేదికగా ప్రారంభమయ్యే ఈ పారిశ్రామిక మహాయజ్ఞం ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టగలదని తెలుగు ప్రజలు విశ్వసిస్తున్నారు.

- నీరుకొండ ప్రసాద్

భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీ కండక్టర్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ కీలక కేంద్రంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాల కోసం భారీ పెట్టుబడులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో... ఆ అవకాశాలను రాష్ట్ర అభివృద్ధికి, యువతకు ఉపాధి కల్పనకు ఉపయోగించుకోవడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడమే కాకుండా వాటి చుట్టూ పూర్తిస్థాయి పారిశ్రామిక వ్యవస్థలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

భారత డేటా సెంటర్ రంగంలో



ఏపీ కీలక మలుపు

పెట్టుబడులతో పాటు లక్షలాది ఉద్యోగాలే లక్ష్యం!

టెక్నాలజీ దిగ్గజాల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం

భారీ పారిశ్రామిక వ్యవస్థల ఏర్పాటుపై నారా లోకేష్ ప్రత్యేక దృష్టి

డేటా సెంటర్లతో పాటు అనుబంధ పరిశ్రమలకు ప్రోత్సాహం

యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

సింగపూర్‌కు చెందిన జర్నలిస్టులతో అక్టోబరు 23న నిర్వహించిన దాదాపు గంటపాటు ఇంటర్వ్యూలో లోకేష్ రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఒక కంపెనీని తీసుకురావడం వల్ల ఆ సంస్థలో మాత్రమే ఉద్యోగాలు వస్తాయని, అదే అనుబంధ పరిశ్రమలతో కూడిన పారిశ్రామిక వ్యవస్థను నిర్మిస్తే విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. డేటా సెంటర్లకు అవసరమైన కూలింగ్ వ్యవస్థలు, విద్యుత్ పరికరాలు, కంప్యూటర్లు, విడిభాగాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థలు కూడా రాష్ట్రంలోనే పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు.

డేటా సెంటర్ల పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా విశాఖపట్నం

అమెరికాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. పారిశ్రామిక అవసరాలకు అనువైన భూములు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, తూర్పు తీర ప్రాంతంలో వ్యూహాత్మక భౌగోళిక స్థానం రాష్ట్రానికి ప్రధాన బలాలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నాన్ని అంతర్జాతీయ అండర్‌సీ ఇంటర్నెట్ కేబుల్ కనెక్టివిటీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ముంబై, చెన్నై నగరాల్లో ఉన్న అంతర్జాతీయ కేబుల్ ల్యాండింగ్ కేంద్రాలకు అదనంగా విశాఖను మరో కీలక గేట్‌వేగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ క్రమంలో గూగుల్ సంస్థ విశాఖపట్నంలో 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ హబ్‌కు ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసింది. అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేయనున్న అతిపెద్ద కేంద్రంగా ఇది నిలవనుంది. మరోవైపు భారత పారిశ్రామిక దిగ్గజం ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రాష్ట్రంలో 15 గిగావాట్ల సామర్థ్యంతో భారీ డేటా సెంటర్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం 17 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నట్లు నివేదికలు వెల్లడించాయి. సిఫీ, సీటీఆర్ఎల్ఎస్ వంటి భారతీయ సంస్థలు కూడా ఈ ప్రాంతంలో డేటా సెంటర్ ప్రాజెక్టులకు అనుమతులు పొందాయి. రాష్ట్రంలో మొత్తం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యానికి సంబంధించి వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదిరినట్లు అధికారులు వెల్లడించారు. ఇది ప్రపంచ స్థాయిలో డేటా సెంటర్ హబ్‌గా గుర్తింపు పొందిన సింగపూర్ సామర్థ్యంతో పోల్చదగిన స్థాయిలో ఉందని కథనం పేర్కొంది.

ఏఐతో ఉద్యోగాలు పోతాయా?

మార్పును అందిపుచ్చుకోవాలి: లోకేష్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా భవిష్యత్తులో ఉద్యోగాలు తగ్గిపోతాయన్న ఆందోళనలపై నారా లోకేష్ స్పందించారు. గత పారిశ్రామిక విప్లవాలు



ప్రారంభంలో అనేక సందేహాలు సృష్టించినప్పటికీ, మార్పులను స్వీకరించిన ప్రాంతాల్లో కొత్త ఉద్యోగాలు, పరిశ్రమలు అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. భారత్ ఏఐ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యతిరేకిస్తే అభివృద్ధిలో కీలక అవకాశాలు కోల్పోతుందని అభిప్రాయపడ్డారు. తాను కూడా వ్యక్తిగత పనితీరును మెరుగుపరుచుకోవడానికి ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నట్టు వెల్లడించారు.దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పెరుగుతున్న జీవన వ్యయం, భవిష్యత్తుపై ఉన్న ఆందోళనలను కూడా ఆయన ప్రస్తావించారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోవాలని, వారికి ఉపన్యాసాలు ఇవ్వడం కంటే వారి సమస్యలను వినడానికి నాయకులు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఉద్యోగాల కల్పన భారత ప్రభుత్వానికి ఎదురవుతున్న ప్రధాన సవాళ్లలో ఒకటని అంగీకరించారు.

హైటెక్‌తో పాటు వ్యవసాయ రంగానికీ ప్రాధాన్యత

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్నప్పటికీ, దేశంలో ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడిన ప్రజల సంఖ్య ఎక్కువగానే ఉందని లోకేష్ గుర్తు చేశారు. అందువల్ల కేవలం క్వాంటం టెక్నాలజీ, ఏఐ రంగాలపైనే దృష్టి పెట్టకుండా వ్యవసాయం, ఆక్వాకల్చర్, ఉద్యానవన రంగాల్లోనూ పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు సంప్రదాయ రంగాలను బలోపేతం చేయడం ద్వారానే సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

సింగపూర్‌తో ప్రత్యేక అనుబంధం... అమరావతి అభివృద్ధికి సహకారం

ఆంధ్రప్రదేశ్, సింగపూర్ మధ్య ఉన్న సంబంధాలను కూడా నారా లోకేష్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంను తనకు మార్గదర్శకుడిగా అభివర్ణించారు. ఆయన రాజకీయ జీవిత ప్రారంభ దశలో నియోజకవర్గ పర్యటనలకు తీసుకెళ్లి, సామాన్య ప్రజలతో నేరుగా మమేకమవడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం వంటి అంశాలను నేర్పించారని గుర్తు చేసుకున్నారు.



2014లో రాష్ట్ర విభజన అనంతరం అమరావతి నిర్మాణానికి సింగపూర్ సంస్థలు సహకరించాయి. 2017లో సింగపూర్ కన్సార్టియానికి కొత్త రాజధానిలో 6.84 చదరపు కిలోమీటర్ల స్టార్టప్ ఏరియా అభివృద్ధి బాధ్యతలు అప్పగించారు. అయితే 2019లో ప్రభుత్వం మారడంతో ఆ ఒప్పందం రద్దయ్యింది. 2024లో చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇరు దేశాల మధ్య సహకారం మళ్లీ పునరుద్ధరించబడింది. ప్రస్తుతం సింగపూర్ అమరావతికి నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తూ పట్టణ ప్రణాళిక, పాలన, శిక్షణ, ఆర్థిక అభివృద్ధి వంటి అంశాల్లో నైపుణ్యాన్ని అందిస్తోంది. ఈ మేరకు 2025 నవంబరులో ఇరుపక్షాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గతంలో అమరావతి ప్రాజెక్టులో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో విదేశీ పెట్టుబడిదారులకు కొంత


B2 | OPINION | THE STRAITS TIMES

Can India's data centre boom deliver jobs? One state is betting it can

Andhra Pradesh is wooing tech giants with billions in investment. Powerful political heir Nara Lokesh says the real prize is building industries and creating jobs.

Bhavan Jaipragas
Senior Columnist

THE SINGAPORE CONNECTION

సందేహం ఉండవచ్చని లోకేష్ అంగీకరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు మారినప్పుడు అభివృద్ధి వేగంపై ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ, సంస్థాగత వ్యవస్థలు, చట్టాలు, విధానాల ద్వారా అభివృద్ధి ప్రాజెక్టులకు నిరంతర భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

అమరావతికి రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు కల్పించేలా పార్లమెంటు ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి సవరణలు చేయడాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీంతో భవిష్యత్తులో రాజధాని విషయంలో విధానపరమైన స్థిరత్వానికి మరింత భరోసా ఏర్పడిందని కథనం పేర్కొంది.

వేగవంతమైన నిర్ణయాలు...

పెట్టుబడుల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత

తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలు కూడా అంతర్జాతీయ పెట్టుబడుల కోసం పోటీపడుతున్నాయని లోకేష్ పేర్కొన్నారు. అయితే ప్రాజెక్టులను వేగంగా అమలు చేయగల సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక బలమని చెప్పారు. రాష్ట్రాలు పెట్టుబడుల కోసం పోటీపడితే చివరకు దేశానికే ప్రయోజనం కలుగుతుందని వ్యాఖ్యానించారు.

రాజకీయ వారసత్వంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... తాను తన తండ్రి నుంచి ఎలాంటి రాజకీయ బాధ్యతల బదిలీని ఆశించడం లేదని, ప్రజలే తమ నాయకులను ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. భారతదేశ రాజకీయ వ్యవస్థ బయటకు కొంత సంక్లిష్టంగా కనిపించినప్పటికీ, ప్రజాస్వామ్య వ్యవస్థలోని సంస్థలు, చట్టాలు, విధానాలు స్థిరత్వాన్ని కల్పిస్తున్నాయని, విదేశీ పెట్టుబడిదారులు ఈ అంశాలను అర్థం చేసుకోవాలని అన్నారు.

మొత్తంగా చూస్తే... డేటా సెంటర్లు, ఏఐ, సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు వాటి ద్వారా అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేసి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యంగా ఈ కథనం స్పష్టం చేస్తోంది.



శశికుమార్
తెలుగుదేశం
సైనికుడు



ఆమదాలవలస మున్సిపల్ ఎన్నికల్లో కూటమి శ్రేణులు క్లీన్ స్వీప్ చేయాలి

●28 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి.. ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆముదాలవలస(చైతన్యరథం): ఆముదాలవలస పట్టణంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆముదాలవలస నియోజకవర్గ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ... ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆముదాలవలస నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు 90 పర్సెంట్ స్థానాల్లో విజయం సాధించి 4ఎంపీపీ 4 జడ్పీటీసీ స్థానాలు క్లీన్ స్వీప్ చేశారని పేర్కొన్నారు. ఈ ఫలితాలు పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనమని అన్నారు. అదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న ఆముదాలవలస మున్సిపల్ ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని మొత్తం 28 వార్డుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ప్రతి వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమష్టిగా ఎన్నికల కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యత, సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, రాబోయే మున్సిపల్ ఎన్నికలను సమిష్టి బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమావేశంలో కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలకు ఎన్నికల ముహూర్తం ఫిక్స్

● 26న పోలింగ్... 28న ఫలితాలు వెల్లడి... కార్పొరేషన్ల వీలన గ్రామాల విలీనంపై ఈనెల 17న సుప్రీంకోర్టులో తుది విచారణ



అమరావతి (చైతన్యరథం): ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణ కీలక దశకు వచ్చింది. మున్సిపల్..జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పూర్తి కాగా.. పంచాయితీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైంది. అయితే, కోర్టు వ్యవహారాల కారణంగా ఎన్నికలు జరగని మూడు కార్పోరేషన్లు.. 20 వరకు ఉన్న మున్సిపాల్టీల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. నోటిఫికేషన్ విడుదల పైనా చర్చలు జరుగుతున్నాయి. న్యాయ వివాదాలు లేకుండా ఎన్నికల నిర్వహణ దిశగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకు ముహూర్తం ఖరారు చేసారు. ఏపీలో మున్సిపల్, జెడ్పీటీస - ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. కాగా, మూడు దశల్లో పంచాయితీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే 13 కార్పోరేషన్లు, 87 మున్సిపాల్టీలకు ఎన్నికలు.. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయింది. న్యాయపరమైన వివాదాల కారణంగా 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ 23 స్థానాల్లో 4 కీలక మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా, మిగిలిన 20 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలుగా ఉన్నాయి. ఎన్నికల నిర్వహణపై స్టే ఇవ్వకపోవడంతో వీటికి కూడా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి త్వరలోనే పూర్తిస్థాయి షెడ్యూల్ విడుదల చేయడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం, మంగళగిరి వంటి అత్యంత కీలకమైన మూడు నగర పాలక సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. కాగా.. ఎన్నికల సంఘం తాజా కసరత్తు మేరకు నవంబర్ 26న జరగనున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటే ఈ పెండింగ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల సంఘం తాజా నిర్ణయంతో..! ఈ కార్పోరేషన్లలో విలీన గ్రామాల విలీనంపై పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. కోర్టుల పరిధిలో ఉన్న ఈ కీలక అంశాలపై నవంబర్ 17న సుప్రీం కోర్టులో తుది విచారణ ఉంది. పలు పిటీషన్ల విత్ డ్రా దిశగా కనిపిస్తున్నాయి. కాగా.. సుమారు 20 పట్టణ సంస్థల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న శ్రీకాళహస్తి, నెల్లూరు–తిరుపతి పరిధిలోని గూడూరు, అల్లూరు, ప్రకాశం పరిధిలోని కందుకూరు, పొదిలి, అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట వంటి మున్సిపాలిటీలు ఈ పెండింగ్ జాబితాలో ఉన్నాయి. వార్డుల సరిహద్దులు, విలీన పంచాయతీల అభ్యంతరాలే ఈ పట్టణాల్లో ఎన్నికల జాప్యానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఇప్పటికే మూడు కార్పోరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేసారు. దీంతో.. న్యాయ పరమైన చిక్కులు లేకుండా ఎన్నికల నిర్వహణ దిశా ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీంతో, 26న పోలింగ్ నిర్వహిస్తే.. 28న ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది.

వెబ్ ల్యాండ్ ఫోర్జరీ ముఠా గుట్టు రట్టు చేసిన ఏపీ సీఐడీ

అమరావతి (చైతన్యరథం): ఏపీ సీఐడీ పోలీసులు వెబ్ ల్యాండ్ ఫోర్జరీ ముఠా గుట్టు రట్టు చేశారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. సీనియర్ ఎన్ఐసీ అధికారి యూజర్ ఐడీని ఈ ముఠా దుర్వినియోగం చేసినట్టు గుర్తించారు. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం ఇండ్లచెరువు, పడమర లక్ష్మీపురం గ్రామాల్లో 6.55 ఎకరాల విస్తీర్ణంలో జరిగిన వెబ్ ల్యాండ్ రికార్డుల్లో అనుమానస్పద అనాధికార మార్పులపై కేసు నమోదైంది. కంప్యూటర్‌ను హ్యాక్ చేసి అనుమతి లేకుండా డేటా డౌన్‌లోడ్ చేయడం, కంప్యూటర్‌లో వైరస్‌లు, మాల్‌వేర్‌లను జొప్పించడం, నెట్ వర్క్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలపై కేసు నమోదు చేశారు. తాహసీల్దార్ కార్యాలయంలో ఎలాంటి మ్యూటేషన్ ప్రొసీడింగ్స్ లేకుండా ఆన్‌లైన్ రికార్డుల్లో కొత్త పట్టాదారుల పేర్లు ప్రత్యక్షం అయినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో వడ్లమూడి ఏడుకొండలు, సాయికుమార్, వేముల వెంకట్రావు, షేక్ భాషాలను సీఐడీ అరెస్టు చేసింది. మొబైల్ ఫోన్లు, డిజిటల్ చెల్లింపు వివరాలు, అడంగల్ వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఫోర్జరీ, చీటింగ్ అభియోగాలతో కూడా కేసు నమోదు చేశారు. ఈ అక్రమాల్లో మరికొంతమందికి ప్రమేయం ఉందని సిఐడి అధికారులు భావిస్తున్నారు. ఫోర్జరీ కోసం పలువురి నుంచి నిందితులు డబ్బులు వసూలు చేసిన గుర్తించారు. కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించారు.

రెండున్నరేళ్లలోనే రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులు

విశాఖపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక రంగం సరికొత్త పుంతలు తొక్కుతోందని, రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వం, ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాలపై నమ్మకంతో దేశ విదేశీ పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు బారులు తీరుతున్నారని ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ పాలనలో తీసుకున్న విధ్వంసకర నిర్ణయాలు, పారిశ్రామికవేత్తలపై వేధింపుల కారణంగా రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని గంటా విమర్శించారు. పెట్టుబడిదారుల్లో నమ్మకం పూర్తిగా సన్నగిల్లడంతో జగన్ హయాంలో దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం దాటి వెళ్లిపోయాయని ఆరోపించారు. ఆ ఐదేళ్ల కాలంలో కేవలం ఒకే ఒక్క పెట్టుబడుల సదస్సును మొక్కుబడిగా నిర్వహించారని గుర్తుచేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రెండుసార్లు సీఐఐ భాగస్వామ్య సదస్సులను విజయవంతంగా నిర్వహించి, ఏకంగా రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించిందని గణాంకాలతో వివరించారు. ఈ తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

విశాఖలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు

● ఈనెల 12,13వ తేదిల్లో జరగనున్న సదస్సుకు భారీ ఏర్పాట్లు... ముఖ్య అతిథులుగా హాజరుకానున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషి

విశాఖపట్నం (చైతన్యరథం): నగరం ఒకసారి మరోసారి అంతర్జాతీయ వేదికగా మారనుంది. ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అతిథులు మెచ్చేలా ప్రతి వివరాన్ని పరిగణనలోకి తీసుకుని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సదస్సు ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే థీమ్‌తో జరుగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకరోజు ముందే విశాఖ చేరుకోనున్నారు. మొదటి రోజు ఉదయం 9.30 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, సీఎం చంద్రబాబు, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ తదితరులు సదస్సును ప్రారంభించనున్నారు. ముగింపు ఉత్సవాల్లో భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొననున్నారు. సుమారు 58 నుంచి 59 దేశాల నుంచి ప్రతినిధులు రానున్నారు. వీరిలో 15 నుంచి 16 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు ఉన్నారు. మొత్తం 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులతో కలిపి దాదాపు 1,250 మంది పాల్గొననున్నారు. సింగపూర్, నేపాల్, కంబోడియా, మయన్మార్, యుఎఈ, కెనడా, మారిషస్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా వంటి దేశాల ప్రభుత్వ ప్రతినిధులు హాజరు కానున్నారు. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రతినిధులు కూడా పాల్గొననున్నారు. అతిథుల సౌకర్యాల కోసం నగరంలోని 26 హోటళ్లలో 580కి పైగా గదులను సిద్ధం చేశారు. సదస్సు వేదిక వద్ద రిజిస్ట్రేషన్ బ్లాక్, పార్కింగ్, ల్యాండ్‌స్కేపింగ్, ఫౌంటెన్లు, సూచిక బోర్డులు, విద్యుత్ ఏర్పాట్లు, భద్రతా ఏర్పాట్లు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయి. నవంబర్ 11న ప్రాథమిక పరిశ్రమల సమావేశాలు, సాయంత్రం సీఎం ఆతిథ్యంలో డిన్నర్ ఉంటుంది. ఈ సదస్సులో ఆరు ప్రధాన అంశాలపై చర్చలు జరుగుతాయి. వాణిజ్యం, పెట్టుబడులు, గ్లోబల్ వాల్యూ చైన్స్, జియోఎకనామిక్స్, అంతర్జాతీయ సహకారం, వ్యవసాయం, ఆహార భద్రత, బయో-బేస్డ్ ఎకానమీ, నైపుణ్యాలు, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు, టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఫ్యూచర్ ఇండస్ట్రీస్, క్లీన్ ఎనర్జీ, సస్టైనబుల్ గ్రోత్, క్వాంటం టెక్నాలజీ, సెమీకండక్టర్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. దాదాపు 400 బీ2బీ బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు, బీ2జీ బిజినెస్ టు గవర్నమెంట్ సమావేశాలు ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పెట్టుబడులు, వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ప్రధాన కేంద్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రాంతీయ సమావేశాల ద్వారా రూ.86,522 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి.

ఇవి 1.47 లక్షల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే రూ.6 లక్షల కోట్ల విలువైన 272 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. మరో రూ.17 లక్షల కోట్ల ప్రాజెక్టులకు అనుమతులు లభించాయి. సమాంతరంగా ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్ 2026 కూడా నిర్వహిస్తున్నారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రం యొక్క పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చూపించి, కొత్త భాగస్వామ్యాలు ఏర్పరచుకోవాలని ప్రభుత్వం ఆశిస్తోంది.

విశాఖ ఏయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ సేవలు రద్దు... భోగాపురంకు అంతర్జాతీయ హోదా

విశాఖ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ సేవలను రద్దు చేశారు. విశాఖపట్నం విమానాశ్రయాన్ని 'అధికారిక ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్'ల జాబితా నుంచి మినహాయిస్తూ (డీనోటిఫై చేస్తూ) కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భోగాపురం విమానాశ్రయానికే అంతర్జాతీయ హోదా కల్పించింది. కొత్తగా నిర్మించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా కేంద్రం గుర్తించడంతో విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు ఇమ్మిగ్రేషన్ హోదాను రద్దు చేశామని ప్రకటించింది. ఇకపై విదేశీ విమానాల రాకపోకలు భోగాపురం నుంచే కొనసాగుతాయని తెలిపింది. అంతర్జాతీయ ప్రయాణికుల ఇమ్మిగ్రేషన్ తనిఖీలు, విదేశీ విమానాల సేవలు ఇక భోగాపురం విమానాశ్రయంలోనే లభ్యమవుతాయని వివరించింది. పాత విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి వాణిజ్య విమాన సేవలు ఈ ఏడాది ఆగస్టు 17 నుంచి పూర్తిగా నిలిచిపోయాయి.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

అర్నబ్ తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు అందజేత

● ఇంటింటికి పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు (చైతన్యరథం): ఇటీవల కురిసిన అర్నబ్ తుఫాన్ కారణంగా ప్రభావితమైన బాధితులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహాయ కార్యక్రమాల్లో భాగంగా కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు పట్టణంలోని యానాదుల కాలనీలో లబ్ధిదారులకు బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 1,357 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి 50 కేజీల బియ్యం, రూ.410 విలువైన నిత్యావసర సరుకుల కిట్‌ను పంపిణీ చేశారు. అదేవిధంగా, తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలోని పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన సుమారు 151 మందికి ఒక్కొక్కరికి రూ.1,000 ఆర్థిక సహాయంతో పాటు రూ.410 విలువైన నిత్యావసర సరుకుల కిట్‌ను అందజేశారు. తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ, వారి అవసరాలను గుర్తించి సహాయ కార్యక్రమాలు చేపడుతోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టూమెన్ కమిటీ సభ్యులు కంఠమనీ రామకృష్ణ, సూర్యపని చిన్ని, ముత్యాల సాయి కుమారి, మండల తాసిల్దార్, ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు అందజేత

● ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుండాలి : బొడ్డు వెంకటరమణ చౌదరి



రాజానగరం (చైతన్యరథం): ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుండాలని రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి సూచించారు. స్థానిక ఎన్నికల్లో మెజారిటీతో విజయం సాధించిన నల్లమిల్లి వీరారెడ్డికి అభినందనలు తెలిపారు. మండపేట మండల జెడ్పీటీసీగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన నల్లమిల్లి వీరారెడ్డి మంగళవారం రాజమహేంద్రవరంలో రుడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నల్లమిల్లి వీరారెడ్డి బొడ్డు వెంకటరమణ చౌదరిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇటీవల జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజల ఆదరాభిమానాలతో భారీ మెజారిటీ సాధించి విజయం అందుకున్న వీరారెడ్డిని బొడ్డు వెంకట రమణ చౌదరి ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మండల అభివృద్ధికి కృషి చేయాలని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజా ప్రతినిధిగా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈ సందర్భంగా బొడ్డు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిర్ల రామన్న కాపు, కర్రి వీర, చిర్ల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబట్టుకోవాలి : జ్యోతుల నెహ్రూ, నవీన్



గండేపల్లి (చైతన్యరథం): : కాకినాడ జిల్లా జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు మర్యాదపూర్వంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చిట్టిబాబు గండేపల్లి మండలం నుంచి టీడీపీ తరపున ఎంపీటీసీగా పోటీ చేసి గెలిచారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ చిట్టిబాబు విజయం పార్టీకి మరింత బలాన్ని చేకూర్చిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీ.రాగంపేటసొసైటీ ఛైర్మన్ కందుల కొండయ్య చౌదరి, శ్రీమంతులు నాగరత్నం, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున యాదవ్‌కు గన్నవరం నియోజకవర్గం గురించి ఏం తెలుసు?

●బీసీల పేరుతో కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలి : మండిపడ్డ కూటమి నాయకులు



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, నియోజకవర్గ అభివృద్ధిపై వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ చేసిన వ్యాఖ్యలపై కూటమి నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు దొంతు చిన్నా, విజయవాడ రూరల్ మండల అధ్యక్షులు గోడళ్ల చిన రామారావు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, పెద్ద అవుటపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు మున్నా రామకృష్ణ, మచిలీపట్నం పార్లమెంటు కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుధాకర్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి, ఎంపీటీసీ చిమాట రవివర్మ, మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో కూటమి స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిందని నాయకులు తెలిపారు. మొత్తం 91 స్థానాలకు గాను 64 స్థానాలను కూటమి గెలుచుకుందని, నాలుగు జడ్పీటీసీ స్థానాల్లో మూడింటిని కైవసం చేసుకుందని పేర్కొన్నారు. ఒక్క జడ్పీటీసీ స్థానంలో మాత్రమే కూటమి అభ్యర్థి చిగురుపాటి కుమారస్వామి స్వల్ప తేడాతో వెనుకబడ్డారని చెప్పారు. ఓట్ల లెక్కింపుపై సందేహాలు ఉండటంతో చట్టబద్ధంగా రీకౌంటింగ్ కోరామని, అది తమ ప్రజాస్వామ్య హక్కు అని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలు చించివేయడం, కౌంటింగ్ సమయంలో విద్యుత్తు నిలిపివేసి అక్రమాలకు పాల్పడటం వంటివి తాము చేయలేదని అన్నారు. అలాంటి చరిత్ర ఉన్న వైసిపి నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి నాయకులు అవినీతి గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని కూటమి నేతలు విమర్శించారు. గత పదేళ్లలో గన్నవరం నియోజకవర్గంలో మట్టి తవ్వకాలు, చెరువుల ఆక్రమణలు, పేకాట క్లబ్బులు, కోడిపందాలు, కబ్జాలు, సెటిల్మెంట్లు మాత్రమే జరిగాయని ఆరోపించారు. నాటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హయాంలో చోటుచేసుకున్న అక్రమాలను ప్రశ్నించిన నాయకుల ఇళ్లపై దాడులు చేయించి, వారిని జైలుకు పంపిన చరిత్ర వైసిపి దే అని గుర్తుచేశారు.

కాకినాడ జీజీహెచ్‌ను 3000 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసే దిశగా ముందడుగు

●కాకినాడ జీజీహెచ్ రూపురేఖలు మార్చే దిశగా ఎంపీ సానా సతీష్ బాబు ప్రయత్నం

●ఆసుపత్రి ఆధునీకరణకు ముందుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ

●విజయవాడలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబుతో ప్రతినిధుల సమావేశం



విజయవాడ (చైతన్యరథం): కాకినాడ ప్రజలకు మెరుగైన, అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ప్రత్యేక చొరవతో కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (GGH)ను 3000 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రస్తుత ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునీకరించి, అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య విభాగాలతో 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్ది ప్రభుత్వానికి అందించే ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ HLL Infra Tech Services Limited (HITES) ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనకు సంబంధించి మంగళవారం విజయవాడలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్‌తో HITES సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో HITES వైస్ ప్రెసిడెంట్ రత్నాచలం, అరుంధతి తదితరులు పాల్గొన్నారు. కాకినాడ జీజీహెచ్‌ను 3000 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రాథమిక అంశాలు, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

కాకినాడ వైద్య రంగానికి ఆధునిక రూపం

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంతంతో పాటు పరిసర జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కీలకమైన ప్రభుత్వ వైద్య సేవల కేంద్రంగా ఉంది. అయితే పెరుగుతున్న జనాభా, మారుతున్న ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా మరింత మెరుగైన వైద్య సదుపాయాలు, ఆధునిక పరికరాలు, ప్రత్యేక వైద్య విభాగాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆసుపత్రిని 3000 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు ఒకే చోట వివిధ రకాల ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఆధునిక వైద్య పరికరాలు, మెరుగైన చికిత్సా సదుపాయాలు, అవసరమైన ఆసుపత్రి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అంశాలను ప్రాథమికంగా చర్చించారు.

HLL Infra Tech Services Limited (HITES) అనేది కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ HLL Lifecare Limitedకు 100 శాతం అనుబంధ సంస్థ. ఆసుపత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, డిజైన్, ఇంజినీరింగ్, నిర్మాణ నిర్వహణ, వైద్య పరికరాల కొనుగోలు, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఆసుపత్రుల నిర్వహణ వంటి రంగాల్లో HITES సేవలు అందిస్తోంది. ఈ సంస్థకు ఉన్న ఆసుపత్రి మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక వైద్య సదుపాయాల ఏర్పాటు అనుభవాన్ని కాకినాడ జీజీహెచ్ ఆధునీకరణకు వినియోగించుకునే అవకాశాలపై సమావేశంలో చర్చించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం: రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అత్యవసర, ప్రత్యేక వైద్య చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గించి, నాణ్యమైన వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాలన్నది తన ప్రయత్నమని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం ద్వారా సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించవచ్చని తెలిపారు.

గెలిచిన అభ్యర్థులను సత్కరించిన టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో పట్టెన్నపాలెం నుంచి కూటమి తరపున ఎంపీటీసీ అభ్యర్థినిగా జనసేన నుంచి పోటీ చేసి గెలుపొందిన ఎంపీపీ అభ్యర్థిని జనసేన జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షుడు ఆకుల రాకేష్ సతీమణి ఆకుల మమతా రాణి మంగళవారం శ్రీనివాసపురంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషుని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో ఎంపీపీ దంపతులను టీడీపీ నాయకులతో కలసి సత్కరించి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా దాసరి శ్యామ్ చంద్రశేషు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఏలికే ప్రసాద్, మాజీ అధ్యక్షుడు పోల్నాటి సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రాగాని శ్రీను, జనసేన పార్టీ అధ్యక్షుడు ఏలికే తాతారావు, పొల్నాటి పెంటరావు, తడికల దావీదు, జొన్నకూటి శ్రీను, రాగాని రామకృష్ణ, తన్నీరు శ్రీను, దాసరి సత్యనారాయణ, పిప్పర లక్ష్మణరావు, బాలం రాంబాబు, మల్లబత్తుల చెల్లారావు, తన్నీరు బుజ్జి, తాడిగడప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

తపాలా కార్యాలయాలలో కేంద్ర మంత్రి పెమ్మసాని ఆకస్మిక తనిఖీ

●'కస్టమర్ సెంట్రిక్' విధానంతో ఇండియా పోస్ట్

●2 ప్రధాన తపాలా కార్యాలయాల్లో కేంద్ర మంత్రి ఆకస్మిక తనిఖీ

●భోపాల్ పర్యటనలో భాగంగా సిబ్బంది, వినియోగదారులతో నేరుగా ముఖాముఖి; బీఎస్ఎన్ఎల్ సేవలపై పెమ్మసాని ప్రత్యేక సమీక్ష



భోపాల్ /గుంటూరు (చైతన్యరథం): తపాల శాఖ ప్రధాన కార్యాలయాల్లో గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీలను మంగళవారం నిర్వహించారు. తనిఖీలలో భాగంగా శాఖ పరమైన సేవలను, ప్రజల అభిప్రాయాలను ఆయన నేరుగా తెలుసుకున్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో విస్తృతంగా పర్యటిస్తున్న ఆయన, నగరంలోని రెండు ప్రధాన పోస్ట్ ఆఫీసులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మికంగా తనిఖీ చేశారు. తపాలా కార్యాలయాల్లో అమలవుతున్న ఆధునిక పద్ధతులు, కౌంటర్ సర్వీసులు, టికెటింగ్ విధానం, పార్సెల్ డెలివరీ నెట్‌వర్క్, మెయిల్ హ్యాండ్లింగ్ వ్యవస్థల పనితీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డా.పెమ్మసాని చంద్రశేఖర్ పోస్టల్ విభాగపు ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమై క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, అవసరాలు మరియు పని పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం పోస్ట్ ఆఫీస్‌కు వచ్చిన కస్టమర్లు, సాధారణ పౌరులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవల నాణ్యత, ఎదురవుతున్న సమస్యలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఇండియా పోస్ట్‌ను సమూలంగా ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. "ఇండియా పోస్ట్ అంటే కేవలం ఉత్తరాల బట్వాడా మాత్రమే కాదు; బ్యాంకింగ్, బీమా రంగాల్లో అత్యంత వేగంగా విస్తరిస్తున్న బలమైన ప్రజా వ్యవస్థ. గత రెండున్నర సంవత్సరాలుగా ఇండియా పోస్ట్‌ను మరింత పటిష్టం చేసి, ఒక కార్పొరేట్ సంస్థ స్థాయిలో వేగవంతమైన, నాణ్యమైన సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రజలు తరతరాలుగా పోస్టల్ వ్యవస్థపై ఉంచిన అచంచలమైన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పూర్తిస్థాయి 'కస్టమర్ సెంట్రిక్' (వినియోగదారుల కేంద్రకృత) విధానంతో ముందుకెళు_న్నాం" అని స్పష్టం చేశారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (IPPB) ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (PLI) వ్యవస్థను డిజిటల్ పద్ధతుల్లో విస్తరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బీఎస్ఎన్ఎల్ (BSNL) వ్యవస్థల పర్యవేక్షణ

పోస్ట్ ఆఫీసుల పరిశీలన అనంతరం, భోపాల్ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ మరియు సాంకేతిక మౌలిక సదుపాయాల పనితీరును డా.పెమ్మసాని స్వయంగా పర్యవేక్షించారు. వినియోగదారులకు అంతరాయం లేని హై-స్పీడ్ కనెక్టివిటీ, మెరుగైన టెలికాం సేవలు అందించేలా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మహిళల కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలించిన వీసీ



నందిగామ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా నందిగామ కేవీఆర్ కళాశాలలో డిసెంబర్‌లో నిర్వహించనున్న దక్షిణ భారత మహిళల కబడ్డీ పోటీల ఏర్పాట్లను కృష్ణ యూనివర్సిటీ వీసీ (వైస్ ఛాన్సలర్) కోన రామ్జీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. 107 యూనివర్సిటీల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం కళాశాల మైదానంలోని ఏర్పాట్లను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, కళాశాల కమిటీ సభ్యులు వీసీని శాలువాతో సన్మానించారు.

ఏలూరులో కలకలం రేపుతున్న పెద్దపులి సంచారం

ఏలూరు (చైతన్యరథం): జిల్లాలో మరోసారి పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. వేలేరుపాడు మండలం నాళ్లవరం పంచాయతీ వద్ద పెద్దపులి సంచరిస్తుండటంతో స్థానిక గ్రామాల ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి తాజాగా జనావాసాలవైపు వస్తూ పశువులపై దాడి చేసింది. కొత్తూరు గ్రామ వాసి కరాటం బ్రహ్మయ్యకు చెందిన ఒక ఆవు, రెండు దూడలను పెద్దపులి దారుణం చంపేసింది. పశువులను చంపేయడంతో భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు.. ఎప్పుడు ఎవరిపై పులి దాడి చేస్తుందో అని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న పరిస్థితి. మరోవైపు పెద్దపులి సంచారంపై అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలకు పలు హెచ్చరికలు జారీ చేశారు. గ్రామస్థులు ఎవరూ కూడా అడవిలోకి వెళ్లవద్దని, రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగవద్దని చెప్పారు. పొలం పనులకు వెళ్లేవారు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరించారు.

మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత

●కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలి

●ఐతవరంలో నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఆత్మీయ సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని



మైలవరం (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా (ఐతవరం) ఐతవరం గ్రామంలో నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, జంపాల సీతారామయ్య తదితర సీనియర్ నాయకులతో కలిసి ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ జిల్లాలో నేను తక్కువగా పర్యటించిన నియోజకవర్గం మైలవరం అని, అందుకు ప్రధాన కారణం అక్కడ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఉన్నారన్న సంపూర్ణ నమ్మకమేనని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేసిన నాయకుడు కృష్ణప్రసాద్ అని ప్రశంసించారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారిని కలుపుకుంటూనే, మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారి సేవలను గుర్తించడం ద్వారా పార్టీ శ్రేణుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేశారని పేర్కొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం

మైలవరం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కానున్నాయని ఎంపీ తెలిపారు. ముఖ్యంగా కొండపల్లి ప్రాంత అభివృద్ధికి రాబోయే రోజుల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా మైలవరం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. జిల్లాలోని కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి సమస్య ఎదురైనా వాటి పరిష్కారం కోసం తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం విజయం మాత్రమే కాదని, అది ప్రజాప్రతినిధులపై ఉంచిన బాధ్యత అని పేర్కొన్న ఎంపీ చిన్ని, ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతి గ్రామ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని సమన్వయంతో పనిచేయాలని నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు సూచించారు.

ఏపీపీఎస్సీ గ్రూప్ -2 సమగ్ర నోటిఫికేషన్ విడుదల...

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్రంలో ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య పెరగడం విశేషం. గతంలో వెలువడిన సంక్షిప్త ప్రకటనలో 686 పోస్టులను పేర్కొనగా, తాజా నివేదికల ప్రకారం ఈ ఖాళీల సంఖ్య 720కి చేరింది. వీటిలో 471 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 249 నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి. ఈ నోటిఫికేషన్‌లో కీలకమైన పలు కీలక శాఖల్లోని ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వీటిలో ప్రధానంగా 203 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు, 176 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ణఎ. వీూఱూ) పోస్టులు ఉన్నాయి. అలాగే 91 సీనియర్ అకౌంటెంట్, 80 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులతో పాటు జూనియర్ అకౌంటెంట్, జీఎస్టీ ఆఫీసర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి ఇతర ముఖ్యమైన పోస్టులు కూడా ఉన్నాయి.

విద్యార్హతలు మరియు ఎంపిక విధానం:

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ (గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే కొన్ని నిర్దిష్ట పోస్టులకు ప్రత్యేక విద్యార్హతలు లేదా నిబంధనలు వర్తిస్తాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమ్స్) నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించిన వారికి మెయిన్స్ పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత పోస్టుల స్వభావాన్ని బట్టి కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, చివరగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా తుది ఎంపిక పూర్తి చేస్తారు.

ముఖ్యమైన తేదీలు:

ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీగా 2026 డిసెంబర్ 11 రాత్రి 11:59 గంటల వరకు గడువు నిర్ణయించారు. అనంతరం అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను 2027 ఫిబ్రవరి 21న ఆఫ్‌లైన్ (ూవీ=) పద్ధతిలో నిర్వహించనున్నట్లు సమాచారం. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. పోస్టుల వారీగా ఖాళీల వివరాలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, పే-స్కేల్స్, పరీక్షా సిలబస్ మరియు ఇతర పూర్తి మార్గదర్శకాల కోసం ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లోని సమగ్ర నోటిఫికేషన్‌ను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

బంగాఖాతంలో మరో అల్పపీడనం... ఏపీకి పొంచి ఉన్న ముప్పు



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఈ మధ్య ప్రకృతి పగబట్టినట్లే వ్యవహరిస్తోంది. ఇప్పటికే గత ఆరు నెలలుగా ఎండలు, ఎల్ నినో ప్రభావం, వర్షపాత లోటుతో సతమతం అవుతున్న ప్రజలకు తాజాగా వరుసగా రెండు తుఫాన్లు వచ్చి ఆ కష్టాలు మరింత పెంచాయి. ఇప్పుడు వాటి నుంచి కోలుకుంటున్న తరుణంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతున్నట్లు వాతావరణ శాఖ చేసిన ప్రకటన మరో షాక్ ఇచ్చేలా ఉంది. ఈనెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈనెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడబోతున్న అల్పపీడనం.. అక్కడి నుంచి 24 గంటల్లో బలమైన అల్పపీడనంగా మారే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో ఈనెల 14, 15 తేదీల్లో సముద్రంలో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో అలల ఉద్ధృతి వల్ల గంటలకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కాబట్టి ఈ నెల 14, 15 తేదీల్లో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి అది బలపడి తుఫానుగా కోస్తా తీరంకి రావడానికి 8-10 రోజులు సమయం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఇది తమిళనాడుకి వెళ్తుందా లేక ఆంధ్ర ప్రదేశ్‌కి వస్తుందా అనేది ఇంకో 5-6 రోజుల్లో తెలుస్తుందని చెప్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఏర్పడ్డ వాయుగుండాలు లేదా అల్పపీడనాలు తీరం వద్దకు రాగానే ఉత్తర దిశకు వెళ్లాయి కాబట్టి ఇది కూడా ఆంధ్రప్రదేశ్‌కి వచ్చే అవకాశాలు ఎక్కువగానే వున్నాయని విశ్లేషిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ఈ అల్పపీడనం ప్రమాదకరమా కాదా అన్నది తేలాలంటే మరో ఐదారు రోజులు ఆగాల్సిందే.

ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

•పరోక్ష పద్ధతిలో జరగనున్న ఎన్నికలు... నవంబర్ 19న ఎంపీపీ, 20న జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక... ప్రకటన విడుదల చేసిన ఎస్ఈసీ



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), జిల్లా పరిషత్ (జెడ్పీ) చైర్మన్ల ఎన్నికల ప్రక్రియ పరోక్ష పద్ధతిలో జరుగుతుంది. ఇకపోతే నవంబర్ 19న ఎంపీపీ, 20న జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు జరగనున్నాయి అని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఎస్ఈసీ (SEC) ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంపీపీ(MPP), జడ్పీ చైర్మన్ల (ZP Chairmen) పరోక్ష ఎన్నికకు సర్వం సిద్ధం అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబర్ 19న ఎంపీపీ, 20న జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు జరగనున్నాయి అని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఎస్ఈసీ(SEC) ఆదేశించింది. 659 మండల ప్రజాపరిషత్‌లు, 28 జిల్లా పరిషత్‌ల చైర్మన్, వైస్ చైర్మన్ (Vice Chairman) స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ప్రక్రియ చేతులు ఎత్తే పద్ధతి ద్వారా చేపట్టనున్నారు.

చేతులెత్తే పద్ధతి ద్వారా ఎంపీపీ, జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్నిక

పరోక్ష ఎన్నికల ప్రత్యేక సమావేశం కోసం నవంబర్ 14వ తేదీలోగా సభ్యులకు నోటీసుల జారీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఎన్నికల రోజున మధ్యాహ్నం 1 గంటకు కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరుగనుండగా... మధ్యాహ్నం 3 గంటలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, ఛైర్ పర్సన్, వైస్ ఛైర్ పర్సన్ల ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎన్నికల రోజున ఉదయం 10 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. అలాగే మధ్యాహ్నం 1 గంట వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. 'చేతులెత్తడం' పద్ధతి ద్వారానే ఎంపీపీ, జడ్పీ ఛైర్‌పర్సన్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల విప్‌కు లోబడే సభ్యులు ఓటు వేయాల్సి ఉంటుంది అని ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటు వేస్తే సభ్యత్వం రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు పార్టీ విప్ నిబంధన వర్తించదు. అధ్యక్ష లేదా ఛైర్ పర్సన్ ఎన్నిక పూర్తయిన తర్వాతే ఉపాధ్యక్ష లేదా వైస్ ఛైర్ పర్సన్ ఎన్నిక నిర్వహిస్తారు. అనివార్య కారణాలతో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరగకపోతే... ఆ వెంటనే జరిగే అధ్యక్ష, ఛైర్ పర్సన్ ఎన్నికల సమావేశం రద్దు అవుతుంది.

కోరం లేకపోతే

కోరం లేకపోయినా లేదా ఇతర కారణాలతో ఎన్నిక వాయిదా పడితే... మరుసటి రోజు (సెలవు దినమైనా సరే) మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఎన్నికల సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానించనున్నారు. అయితే వారికి ఎలాంటి ఓటు హక్కు ఉండదు అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పార్టీ విప్‌గా వ్యవహరించే వ్యక్తుల వివరాలను ఎన్నికకు ముందు రోజు ఉదయం 11 గంటలలోగా ప్రిసైడింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల పారదర్శకత కోసం వీడియో చిత్రీకరణ, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా లైవ్ కవరేజీకి అనుమతి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

డిప్యూటీ మేయర్లు, వైస్‌ఛైర్మన్ల ఎన్నికలు ఈ నెల 23న

మరోవైపు ఎన్నికలు పూర్తయిన నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఈ నెల 23న డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్లను పరోక్ష పద్ధతిలో ఎన్నుకోనున్నారు. అవసరమైతే ఈ ప్రక్రియను 24న పూర్తి చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్నికల షెడ్యూల్

ఎంపీపీ ఎన్నికలు: నవంబర్ 19వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 659 మండలాల్లో ఎంపీపీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మరియు కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరుగుతుంది.

జిల్లా పరిషత్ ఎన్నికలు: నవంబర్ 20వ తేదీన జిల్లా కేంద్రాల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ మరియు కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారు.

నోటీసులు: ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు నవంబర్ 14వ తేదీలోగా సంబంధిత ఎన్నికల అధికారులు లిఖితపూర్వక నోటీసులు జారీ చేస్తారు.

మధ్యాహ్నం 1 గం.కు కో ఆప్షన్ సభ్యులు, 3 గం.లకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక... చేతులెత్తే పద్ధతి ద్వారా ఓటింగ్ ప్రక్రియ.

ఎన్నికల విధానం మరియు నిబంధనలు

కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక: ప్రధాన పదవుల ఎన్నికకు ముందుగా, మండల పరిషత్‌లలో ఒక్కొక్కరు చొప్పున, జిల్లా పరిషత్‌లలో ఇద్దరు చొప్పున కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు.

ఓటు హక్కుపై స్పష్టత: ఈ పరోక్ష ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఓటు హక్కు ఉండదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

శ్రీశైలం ఆలయంలో కార్తిక మాసోత్సవాలు ప్రారంభం... స్పర్శ దర్శనం రద్దు



శ్రీశైలం (చైతన్యరథం): శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. కార్తికమాసం మొదటి రోజు కావడంతో శ్రీశైలం మల్లన్న క్షేత్రంలో భారీగా భక్తుల రద్దీ నెలకొంది. గంగాధర మండపం వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్నారు. రద్దీ దృష్ట్యా నెలరోజుల పాటు సామూహిక గర్భాలయ అభిషేకాలను నిలిపివేశారు. ఈ ఉత్సవాలు నవంబర్ 10 నుంచి డిసెంబర్ 9 వరకు నిర్వహించనున్నారు. అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో వార్షిక కార్తిక మాస ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారనే సంగతి తెలిసిందే. ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఈ క్రమంలోనే ఆలయ అధికారులు కూడా విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జాగ్రత్తలు చేపట్టారు. ముఖ్యంగా వసతి, తాగునీరు, సులభతర దర్శనం, క్యూ లైన్ల నిర్వహణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఆకాశ దీపం ఏర్పాటు

కార్తిక మాసంలో వచ్చే సోమవారాలు, ఇతర ముఖ్యమైన పర్వదినాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్టుగా ఆలయ అధికారులు తెలిపారు. శ్రీశైలంలో కార్తిక మాస ఉత్సవాల్లో భాగంగా, ప్రతి సోమవారం, కార్తిక పౌర్ణమి రోజున పుష్కరిణి హారతి, లక్షదీపోత్సవం నిర్వహించనున్నారని చెప్పారు. వీటితో పాటు నవంబర్ 13న కృష్ణమ్మ హారతి, నవంబర్ 20న కోటి దీపోత్సవం, కార్తిక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 24న జ్వాలా తోరణోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల మొత్తం 'ఆకాశ దీపం' ఏర్పాటు చేయడంతో పాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు.

పర్వదినాల్లో స్పర్శ దర్శనం నిలిపివేత

ప్రతిరోజూ తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఆ తర్వాత ఉదయం వేళ పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. భక్తులకు ఉదయం 4:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు... తర్వాత సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి వరకు దర్శనాలు కల్పించనున్నారు. అయితే కార్తిక మాసంలో శని, ఆది, సోమవారాలు, ఇతర పర్వదినాల్లో 'స్పర్శ దర్శనం' (స్వామివారిని తాకి దర్శించుకోవడం) పూర్తిగా రద్దు చేశారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు విడతల వారీగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం చేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు... కార్తిక మాసంలోని 16 రోజుల పాటు ముఖ్యంగా శని, ఆది, సోమవారాలు, ఇతర పండుగ రోజులలో అంతరాలయంలో నిర్వహించే కుంకుమార్చనలను ఆశీర్వచన మండపంలోకి మారుస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్తిక మాసంలో రూ.5 వేల గర్భాలయ అభిషేకాలు, రూ.1,500 సామూహిక అభిషేకాలు రద్దు చేసినట్టుగా చెప్పారు.

రూ.500 అప్పు తిరిగివ్వలేదని వ్యక్తిపై వేడి నూనె పోసిన మహిళ



గూడూరు (చైతన్యరథం): నగదు అప్పు తీసుకుని.. తిరిగి చెల్లించలేదని ఓ వ్యక్తిపై మహిళ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు అతడిపై సలసల కాగే నూనె పోసింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దారుణ సంఘటన నెల్లూరు రూరల్ మండలం మాదరాజు గూడూరులో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై శీనయ్య కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి.. ఆ మహిళను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గతంలో ఓ మహిళ వద్ద శీనయ్య అనే వ్యక్తి రూ.500 అప్పు తీసుకున్నాడు. ఆ నగదు తిరిగి చెల్లించాలని అతడిని ఈ రోజు సదరు మహిళ నిలదీసింది. మయంలో తమ అభ్యర్థులను కిడ్నాప్ చేశారని కూడా పేర్కొన్నారు. తన వద్ద అంత నగదు లేదని ఒకింత ఆగ్రహంతో ఆమెకు బదులిచ్చాడు. దీంతో మండిపడిన ఆ మహిళ తన ఇంట్లో బాగా కాగిన నూనెను అతడిపై పోసింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలై.. బాధతో బిగ్గరగా అరిచాడు. స్థానికులు వెంటనే స్పందించి సమీపంలోని ఆసుపత్రికి క్షతగాత్రుడిని తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అతడిని నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

గుంటూరు టు గుంతకల్లు మధ్య రైళ్లకు లైన్ క్లియర్



అమరావతి (చైతన్యరథం): ఏపీలో కొత్త రైల్వే లైన్ ప్రారంభం.. రాయలసీమలో మరో కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వచ్చింది. ఈనెల 6న దక్షిణ కోస్తా రైల్వే అధికారులు నంద్యాల-గాజులపల్లి మధ్య 15.121 కి.మీ.ల నూతనంగా నిర్మించిన రెండో రైల్వే లైన్‌ను ప్రారంభించారు. ఈనెల 1 నుంచి మూడో తేదీ వరకు స్పీడ్ టెస్ట్‌లు నిర్వహించగా.. విజయవంతం అయ్యాయి. దీంతో ఆ నూతన రైలు మార్గంలో రైళ్ల రాకపోకలను అనుమతించారు. ఈనెల 3న అధికారులు కొత్త రైల్వేలైనులో స్పీడ్ పరీక్షల్ని పరిశీలించారు. ప్రస్తుతానికి వంద కిలోమీటర్ల వేగంతో రైళ్లు వెళ్లేందుకు అనుమతి వచ్చింది. ఈ నూతన రైలు మార్గంలో ఒక మెయిన్ బ్రిడ్జితో పాటుగా 17 చిన్న బ్రిడ్జిలు కూడా నిర్మించిన సంగతి తెలిసిందే. నందిపల్లి దగ్గర సరుకు రవాణాకు వీలుగా లోడింగ్.. అన్‌లోడింగ్‌కు అవసరమైన ప్లాట్‌ఫామ్‌ను కూడా ఏర్పాటు చేశారు. గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనుల్లో భాగంగా నిర్మాణం చేశారు. మొత్తం ఆరు కొత్త లూప్ లైన్లు, మూడు కొత్త హైలెవెల్ ప్యాసింజర్ ప్లాట్‌ఫామ్‌లు, ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు.. ఆయా పనుల్లో భాగంగా వీటి నిర్మాణం చేపట్టారు. డబ్లింగ్ మార్గానికి సంబంధించిన వివరాలను దక్షిణ కోస్తా రైల్వే అధికారులు విడుదల చేశారు. మరోవైపు నంద్యాల-గాజులపల్లి రైల్వే లైన్ క్లియర్ కావడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని చెబుతున్నారు. రైలు ప్రయాణికుల కష్టాలు తీరుతాయి.. మరిన్ని కొత్తరైళ్లు నడిపే అవకాశం ఉంటుందని.. ప్రయాణ సౌకర్యాలు మెరుగవుతాయని కూడా చెబుతున్నారు. దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని నంద్యాల-గాజులపల్లి రైల్వే లైన్ కీలకమైన రైల్వే కారిడార్‌గా ఉంది. నంద్యాల - గాజులపల్లి మధ్య ఈ డబుల్ లైన్ పొడవు సుమారు 15.12 కిలోమీటర్లు. ఈ ప్రాజెక్టులో భాగంగా గాజులపల్లి, నందిపల్లి రైల్వే స్టేషన్లలో నూతన భవనాలను నిర్మించారు. సింగిల్ లైన్ ఉన్నప్పుడు రైళ్లు క్రాసింగ్ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఎదురయ్యేవి. డబుల్ లైన్ అందుబాటులోకి రావడం వల్ల గుంటూరు-గుంతకల్లు మార్గంలో రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. ఇకపై ప్రయాణికుల రైళ్లతో పాటు సరుకు రవాణా రైళ్లు కూడా వేగంగా, సులభంగా వెళ్లొచ్చు. గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులో ఈ మొత్తం 401 కిలోమీటర్లు కాగా.. నంద్యాల-గాజులపల్లి విభాగం పూర్తి కావడంతో, ఇప్పటివరకు 374 కిలోమీటర్లు (సుమారు 93.27%) పనులు పూర్తయ్యాయి. ఇక మిగిలిన 27 కిలోమీటర్లు పూర్తయితే ఈ కారిడార్ మొత్తం డబుల్ లైన్‌గా మారిపోతుంది అంటున్నారు. మొత్తం మీద గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులో కీలకమైన లైన్ పనులు పూర్తయ్యాయి.

కళాశాల భవనం నుంచి కిందపడి విద్యార్థినికి గాయాలు

కమలానగర్ (చైతన్యరథం): కళాశాల భవనం రెండో అంతస్తు నుంచి కిందపడి విద్యార్థినికి తీవ్ర గాయాలైన ఘటన కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చోటుచేసుకుంది. అధ్యాపకులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా నార్పల మండలం బి. పప్పూరు గ్రామానికి చెందిన వసంత బీఏ రెండో ఏడాది చదువుతోంది. గత నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటోంది. మంగళవారం కళాశాలకు వచ్చి కళ్లు తిరిగి రెండో అంతస్తు నుంచి కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన అధ్యాపకులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు.

ఎంపీటీసీ గెలిచిన గ్రామంలోనే గొడ్డలి పార్టీకి ఎదురుదెబ్బ

●టీడీపీ ఇన్‌ఛార్జ్ సమక్షంలో వైసీపీ శ్రేణుల 100 కుటుంబాలు టీడీపీలోకి



మంత్రాలయం (చైతన్యరథం): స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మంత్రాలయం నియోజకవర్గంలో మరో భారీ గొడ్డలి పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల జరిగిన మంత్రాలయం మండల ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించిన వగురురూ గ్రామం నుంచే సుమారు 100 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు షాకీర్ దొర, షాచిర్ దొర, డీలర్ రఫీక్, హుసేని, మాజీ సర్పంచ్ నరసింహులు మాజీ ఎంపిటిసి తిక్కన్న, బుజ్జప్ప, మహమ్మద్ హుసేని, హేదర్, దాదా, షబ్బీర్ మరియు వెంకటరాముడు మరియు తదితరులకు మంత్రాలయం టీడీపీ ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్రరెడ్డి సోదరులు ఎన్.రఘునాథ్‌రెడ్డి మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణరెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ... ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి విజయం సాధించినప్పటికీ, అదే గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో ఎన్నికల ఫలితాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం దిశగా మన్యశ్రీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు భవిష్యత్తు నాయకులు నారా లోకేష్ అడుగులు వేస్తున్నారని అదేవిధంగా పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిగా భావిస్తూ వారి కష్టసుఖాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతమే నా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీలోకి కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ రాఘవేంద్రరెడ్డి నాయకత్వంపై నమ్మకంతో, ఆయన చేస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలిపారు. పార్టీ అభివృద్ధికి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కల్లుదేవకుంట సొసైటీ చైర్మన్ రాఘమ్మా, జిల్లా జనరల్ సెక్రటరీ మద్దిలేటి, పవన్, గోపాల్, వీరారెడ్డి, లింగప్ప మరియు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి మెడలు వంచిన పులివెందుల దౌర్జన్యం : ఉమేష్‌రావు



అమరావతి (చైతన్యరథం): గత కొన్ని దశాబ్దాలుగా దాడులు, దౌర్జన్యాలను ఆసరాగా చేసుకొని రాజకీయ పబ్బం గడుపుకుంటున్న వైయస్ కుటుంబ నియంతృత్వం సృష్టించిన అడ్డంకులను అధిగమించి, వెన్ను చూపకుండా ఎదిరించి పులివెందుల దౌర్జన్యం మెడలు వంచిన ప్రజాస్వామ్యానికి వేల వేల దండాలు సమర్పిస్తున్నామని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు తెలిపారు.

అరాచకాన్ని జయించిన ఆనందమ్మ విజయం స్ఫూర్తిదాయకం

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన ప్రాదేశిక ఎన్నికలలో తొట్టంబేడు ప్రాదేశిక స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున చిల్లకూరు ఆనందమ్మ సమర్పించిన నామినేషన్‌ను అరాచకపు వైసిపి మూకలు అక్రమంగా తిరస్కరించి, బయటకు గెంటేసి వైసిపి వారు ఏకగ్రీవం చేసుకున్నారని, సరిగ్గా ఐదేళ్ళ తరువాత అదే చిల్లకూరు ఆనందమ్మను తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు ప్రాదేశిక సభ్యురాలిగా నిలబెట్టగా, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కలిగిన ఓటరు మహాశయుల ఆశీస్సులతో ఆనందమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని కొనియాడారు. ఈ సందర్భంగా చిల్లకూరు ఆనందమ్మ సాధించిన స్ఫూర్తిదాయకమైన విజయం ప్రజాస్వామ్యం యొక్క గొప్పదనాన్ని తెలియజేసిందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక జయరాంరావు వీధిలోని, తెలుగుదేశం పార్టీ మాజీ కౌన్సిలర్ నివేదిత మోరె ఆధ్వర్యంలో ఆనందమ్మని ఘనంగా సత్కరించారు.

సామాజిక న్యాయం టిడిపితోనే సాధ్యం

నందమూరి తారక రామారావు చేతుల మీదుగా పురుడు పోసుకున్న తెలుగుదేశం పార్టీతోనే సామాజిక న్యాయం, పేదలకు రాజ్యాధికారం సాధ్యమని భావించి, గడచిన నాలుగు దశాబ్దాలుగా త్రికరణ శుద్ధిగా బలహీన వర్గాలకు ప్రజా ప్రతినిధులుగా అవకాశాలు కల్పిస్తున్నదని కొనియాడారు. ఇదే క్రమంలో సీఎం చంద్రబాబునాయుడు కూడా బడుగుబలహీనవర్గాల వారికి రాజ్యాధికారం అందించేలా, ప్రస్తుతం జరిగిన పురపాలక ఎన్నికలలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ, తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నిక కాబడిన మొత్తం 70 మంది ఛైర్మన్ మరియు మేయర్ లలో 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందినవారే. ప్రత్యేకించి బీసీ వర్గానికి చెందిన వారికి 35.7% శాతంతో దాదాపు 25 పదవులు కేటాయించడం సామాజిక మరియు రాజకీయ చరిత్రలో నిలిచిపోయే చిరస్మరణీయ ఘట్టం అని కొనియాడారు.

ప్రజాస్వామ్యం అండగా పరుగెడుతున్న ప్రగతి

అటు పల్లెటూరి నుంచి నగరాల వరకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలతో పరుగులు పెడుతున్న ప్రగతికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకం ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచి, ప్రజాస్వామ్య విజయాన్ని అందించిన ఆంధ్రప్రదేశ్ ప్రజల చైతన్యవంతమైన స్ఫూర్తిని కొనియాడారు. అలాగే జిల్లా మరియు మండల ప్రాదేశిక ఎన్నికలలో ఎన్డీయే కూటమికి ఘనవిజయాన్ని అందించిన సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వం, పవన్ కళ్యాణ్ అండ, నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ముందుకు పరిగెడుతున్న ప్రగతి పాలనకు ప్రజాస్వామ్య వాదులు మరోసారి మద్దతుగా నిలిచి జై కొట్టారని కొనియాడారు.

పుంగనూరు ఆవు, దూడకు రికార్డు ధర ఏకంగా రూ.5.30 లక్షలకు కొనుగోలు



కోనసీమ జిల్లా (చైతన్యరథం): ఉభయ గోదావరి జిల్లాల్లోనే పుంగనూరు ఆవుకు అత్యధిక ధర పలికిందని ఫామ్ నిర్వాహకుడు అడబాల ప్రేమ్ కుమార్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామం. గ్రామంలోని ఆధ్యశ్రీ డైరీ ఫామ్‌లో పెంచుతున్న స్వచ్ఛమైన పుంగనూరు జాతి ఆవు-గిత్తదూడకు రికార్డు స్థాయిలో ధర లభించింది. మద్రాసుకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్త ఈ ఆవును ఏకంగా రూ.5 లక్షల 30 వేల రూపాయలకు కొనుగోలు చేసినట్లు ఫామ్ నిర్వాహకుడు ప్రేమ్ కుమార్ తెలిపారు. గతంలో తమ ఫామ్ నుంచి ఎన్డీడీబీ సౌత్ బ్యాంక్‌కు కూడా పుంగనూరు ఆవును అందించినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం పలికిన రూ.5.30 లక్షల ధర ఉభయ గోదావరి జిల్లాల్లోనే అత్యధికమని ఆయన తెలిపారు. ఈ ఆవు 100 శాతానికి పైగా స్వచ్ఛమైన పుంగనూరు జాతి లక్షణాలు కలిగి ఉందని, 36 అంగుళాల ఎత్తుతో పాటు జాతికి సంబంధించిన ప్రత్యేక శరీర నిర్మాణం, మూపురం వంటి లక్షణాలు కలిగి ఉందని వివరించారు. రోజుకు రెండు పూటలా మూడు లీటర్ల చొప్పున ఆరు లీటర్లు పాలు ఇస్తుందని ప్రేమ్ కుమార్ చెప్పారు. కార్తీక మాసంను పురస్కరించుకుని స్వచ్ఛమైన పాలు,పెరుగు, నెయ్యి కోసం పుంగనూరు ఆవును తమ యజమాని కొనుగోలు చేసినట్లు ఆవును తమిళనాడు తీసుకెళ్లేందుకు వచ్చిన వ్యాపారవేత్త గుమస్తా తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం : జేసీ ప్రభాకర్ రెడ్డి



అనంతపురం (చైతన్యరథం): నగరం నిజంగా అభివృద్ధి చెందాలంటే మేయర్ రమేష్ గౌడ్ టీడీపీలోకి రావాలని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. తాను గతంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న రోజుల్లో అధికారులు తన మాట పట్టించుకోకపోవడం వల్ల ఎంత ఇబ్బంది పడ్డానో అనుభవించానని, అందుకే ఇప్పుడు మేయర్‌కు ఈ సలహా ఇస్తున్నానని ఆయన వివరించారు. అధికార పార్టీలో ఉంటేనే కమిషనర్ సహా అధికారులు వినిపించుకుంటారని, లేకపోతే నగరానికి అవసరమైన నిధులు సకాలంలో రావని తెలిపారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యాలు జరిగాయని, కుప్పం మున్సిపాలిటీలో తమిళనాడు నుంచి జనాలను తెచ్చి దొంగ ఓట్లు వేయించారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో తమ అభ్యర్థులను కిడ్నాప్ చేశారని కూడా పేర్కొన్నారు.

పీవీ సింధుకు అరుదైన గౌరవం... అభినందనలు తెలిపిన మంత్రి రాంప్రసాద్

అమరావతి (చైతన్యరథం): భారత ఒలింపిక్ సంఘం అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఎంపిక కావడం పట్ల రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు అరుదైన గౌరవం దక్కిందని అన్నారు. ఈ సందర్భంగా పీవీ సింధుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. అథ్లెట్స్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఎన్నిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఐఓఏ జనరల్ బాడీలో అథ్లెట్ ప్రతినిధులుగా మీరాబాయి చాను, సాజన్ ప్రకాష్ ఎంపిక కావడం భారత క్రీడారంగానికి గర్వకారణమని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన క్రీడాకారులకు కీలక బాధ్యతలు దక్కడం సంతోషంగా ఉందని అన్నారు. క్రీడాకారుల నాయకత్వంలో భారత క్రీడారంగం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ఏపీలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు.

ఎన్నికల్లో గెలుపు... ఊహించని రీతిలో ఆకస్మిక మరణం

●ఫలితాలు వెలువడిన రోజు రాత్రి కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపిన బోయలక్ష్మి

● తీవ్ర అస్వస్థతతో సోమవారం మృతి... లక్ష్మి కుటుంబంలో విషాదఛాయలు

కర్నూలు (చైతన్యరథం): ఎంపీటీసీగా గెలిచి రెండు రోజులు కూడా కాకముందే ఓ మహిళ అకాల మరణం చెందారు. దీంతో ఆ మహిళ కుటుంబంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు నవంబర్ 7న వెల్లడయ్యాయి. ఈ ఎన్నికల్లో కర్నూలు జిల్లా ఆలూరు-4 ఎంపీటీసీ స్థానం నుంచి బోయలక్ష్మి విజయం సాధించారు. టీడీపీ తరఫున పోటీచేసిన బోయ లక్ష్మి విజయం సాధించడంతో ఆమె కుటుంబసభ్యులు, స్థానిక టీడీపీ శ్రేణులు ఆనందంలో మునిగిపోయాయి. ఫలితాలు వెలువడిన రోజు రాత్రి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి లక్ష్మి సంబరాలు చేసుకున్నారు. అయితే బోయ లక్ష్మి సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. ఆదివారం రోజున బోయ లక్ష్మి అస్వస్థతకు గురయ్యారు. దీంతో లక్ష్మిని కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఎంపీటీసీగా గెలిచిన బోయలక్ష్మి... ఆ బాధ్యతలు స్వీకరించకముందే అకాల మరణం చెందారు. ఆమె గెలుపు ఆనందం కొన్ని గంటల్లోనే ఆవిరైంది. దీంతో బోయలక్ష్మి కుటుంబంలో, స్థానిక టీడీపీ శ్రేణుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఇక, ఏపీలో పరిషత్ ఎన్నికల తుది ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ తిరుగులేని ఆధిక్యాన్ని కనబరిచింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 582 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అందులో టీడీపీ ఏకంగా 406 స్థానాలను గెలుచుకుని రికార్డు సృష్టించింది. అయితే కూటమి పార్టీలు అయినటువంటి జనసేన 73 స్థానాల్లో విజయం సాధించగా బీజేపీ 20 జడ్పీటీసీ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. ఇకపోతే ప్రతిపక్ష పార్టీ అయిన వైసీపీ 76 స్థానాల్లో విజయం సాధించింది. ఇక జడ్పీటీసీల విషయానికి వస్తే ఇండిపెండెంట్ అభ్యర్థులు 6 స్థానాలను దక్కించుకోగా సీపీఐ(ఎం) ఒక



స్థానంలో గెలుపొందింది. మరోవైపు ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి పార్టీల అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. రాష్ట్రవ్యాప్తంగా 7,768 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అయితే టీడీపీ అభ్యర్థులు 4,806 ఎంపీటీసీ స్థానాల్లో విజయకేతనం ఎగురవేయగా... వైసీపీ అభ్యర్థులు 1,711 స్థానాల్లో విజయం సాధించారు. ఇక జనసేన పార్టీ విషయానికి వస్తే 938 స్థానాల్లో విజయం సాధించగా... బీజేపీ 117 స్థానాలను కైవసం చేసుకుంది. ఇదిలా ఉంటే, స్వతంత్ర అభ్యర్థులు 169 స్థానాల్లో విజయం సాధించి తమ బలాన్ని నిరూపించుకున్నారు.

ఖతార్‌లో ఘనంగా తెలుగు డయాస్పోరా ఫెడరేషన్

ఆనందాల వేడుకలు

650కి పైగా కుటుంబాలు హాజరు



ఖతార్: విదేశీ గడ్డపై తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్తూ తెలుగు ప్రజల ఐక్యతకు ప్రతీకగా ఖతార్‌లో తెలుగు డయాస్పోరా ఫెడరేషన్ (Telugu Diaspora Federation-TDF) ఖతార్ శాఖ ఆవిర్భావ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఖతార్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 650 మందికి పైగా తెలుగు కుటుంబాల వారు హాజరై వేడుకలను చిరస్మరణీయంగా మార్చారు. ప్రముఖ తెలుగు సంఘాలైన AKV, TKS, TPS, TJQ, APWA, TGS, TSA ప్రతినిధులు, సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొని వేడుకలను ఆస్వాదించారు. తెలుగు సంఘాల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవానికి ఈ వేడుకలు అద్దంపట్టాయి.

TDF ఖతార్ అధ్యక్షుడు యలమంచిలి శాంతయ్య అధ్యక్షత వహించగా... భారత రాయబార కార్యాలయం నుంచి ఫస్ట్ సెక్రటరీ హరీష్ పాండే, అతిథిగా ప్రముఖుడు గొట్టిపాటి రమణయ్య హాజరై వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. గాయనీ, గాయకులు మానస ఆచార్య, హరి గుంట తమ అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. యాంకర్ స్వప్న చౌదరి తన చక్కటి వ్యాఖ్యానంతో కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నడిపించారు. ఆంజనేయులు, కళ్యాణ్ చక్రవర్తి మహాభారతంలోని దుర్యోధనుడు, శకుని పాత్రలను అద్భుతంగా ఆవిష్కరిస్తూ తమ నటనా ప్రతిభతో సభికులను మంత్రముగ్ధులను చేశారు.

చిన్నారులు, మహిళలు, కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వినోద కార్యక్రమాలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. చిన్నారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు, కుటుంబ సభ్యుల సందడి, పెద్దల ఆత్మీయ పలకరింపులతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల కేరింతలు, కుటుంబ సభ్యుల చిరునవ్వుల మధ్య ఖతార్‌లో ముందుగానే దీపావళి పండుగ శోభ సాక్షాత్కరించింది.

TDF బృందం ఎన్నో రోజుల ప్రణాళిక, సమన్వయం, అంకితభావం, సమష్టి కృషితో ప్రతి అంశాన్నీ ఎంతో శ్రద్ధగా నిర్వహించి ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. అతిథుల ఆహ్వానం నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు, కుటుంబ సభ్యుల వినోద ఏర్పాట్ల వరకు... ప్రతి విషయంలోనూ నిర్వాహకుల ముందుచూపు స్పష్టంగా కనిపించింది. 650 మందికి పైగా కుటుంబ సభ్యులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా వేడుకలను ఆనందంగా ఆస్వాదించేలా చేసిన టీడీఎఫ్ బృందం కృషి నిజంగా అభినందనీయం.

తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం, ప్రవాసాంధ్రుల ఐక్యతను బలోపేతం చేయడం, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం తెలుగు డయాస్పోరా ఫెడరేషన్ ప్రధాన లక్ష్యాలని నిర్వాహకులు తెలిపారు. వేడుకలకు విచ్చేసిన వారికి, విజయవంతం చేసిన వారికి టీడీఎఫ్ ఖతార్ బృందం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.







ఉత్సాహంగా... వైభవంగా...

దక్షిణ ఆస్ట్రేలియా ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు

మధుర జ్ఞాపకాలను పంచుకున్న ప్రవాస తెలుగు కుటుంబాలు



అడిలైడ్ (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియాలోని అడిలైడ్ నగరంలో ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల వేడుకను ఆహ్లాదకర వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రవాస తెలుగు కుటుంబాలన్నీ ఒక్కచోట చేరి ఈ వేడుకను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా వివిధ రకాల ఆటపాటల్లో పాల్గొని మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రకృతి ఒడిలో జరిగిన ఈ వనభోజనాలు అందరికీ సరికొత్త ఉత్సాహాన్ని అందించాయి. వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన APNRT స్టాల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవాస తెలుగువారి కోసం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి సేవలను స్థానిక తెలుగు వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి శ్రీనివాస్ పల్లపోతు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ APNRT సభ్యత్వం తీసుకోవడంతో పాటు ఎన్ఆర్ఐల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సదుపాయాలు, ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు శ్యామ్‌ప్రసాద్ కోడూరి, విజయ్ చెన్నుపాటి, నర్మద గరికపాటి, గోపి నంబళ్ల ప్రత్యేక అతిథులుగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యత్వాన్ని మరింత విస్తృతం చేస్తూ పార్టీ కార్యక్రమాలను అందరూ సమష్టిగా, క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్తీక వనభోజనాల వేడుకకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అడిలైడ్‌లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా సాగిన ఈ కార్యక్రమం ప్రవాస తెలుగు వారి అందరిలోనూ నూతనోత్సాహాన్ని నింపింది.





లండన్ బరో ఆఫ్ సటన్ కౌన్సిలర్‌గా చంద్ర

లిబరల్ డెమోక్రటిక్ పార్టీ తరపున ఎన్నిక

వెంటనే స్థానిక పాఠశాల విరాళాల కోసం 38 కి.మీ. పాదయాత్ర

సటన్ (లండన్): తెలుగు వారంతా గర్వపడేలా లండన్ బరో ఆఫ్ సటన్ కౌన్సిలర్‌గా ఆలపాటి చంద్ర ఎన్నికయ్యారు. ఆయన లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. స్థానిక తెలుగు వ్యక్తి ఈ ఘనత సాధించడంతో ఆ ప్రాంతంలోని తెలుగు వారంతా సంబరాలు జరుపుకున్నారు. ఆయన్ను అభినందనల్లో ముంచెత్తారు. ఎన్నికల్లో గెలుపొందిన వెంటనే విద్యా వ్యవస్థ పట్ల తన నిబద్ధత చాటుకున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నిధుల సేకరణ కోసం 38 కిలో మీటర్లు పాదయాత్ర చేసి స్ఫూర్తిగా నిలిచారు. సుమారు 7 గంటల పాటు నిరంతరాయంగా పాదయాత్ర చేయడం ద్వారా విద్యా మౌలిక సదుపాయాల కల్పన పట్ల తన అంకితభావాన్ని చాటారు. ఇలా తాను సేకరించిన నిధులు స్థానిక ప్రభుత్వ పాఠశాల అవసరాలకు, విద్యార్థుల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.

చురుకైన నాయకుడిగా... సంక్షేమానికి కట్టుబడిన ప్రజాప్రతినిధిగా...

సమాజంలో చురుకైన నాయకుడిగా, ప్రజల సంక్షేమానికి కట్టుబడిన ప్రజాప్రతినిధిగా చంద్ర చేసిన పాదయాత్రకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభించింది. స్థానిక పార్లమెంటు సభ్యుడు, సటన్ మేయర్, పాఠశాల విద్యార్థులు,



వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు చంద్రను ప్రశంసించారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగు సంఘం నాయకుడు భాస్కరరావు అమ్మినేని మాట్లాడుతూ... 'కౌన్సిలర్ ఆలపాటి చంద్ర చేపట్టిన ఈ పాదయాత్ర పిల్లల భవిష్యత్తు పట్ల, స్థానిక విద్యా వ్యవస్థ పట్ల ఆయనకున్న నిబద్ధతకు ప్రతీక' అన్నారు. సమాజ సేవ, విద్యాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేస్తున్న నిరంతర కృషికి ఈ పాదయాత్ర ఒక బలమైన నిదర్శనమని తెలిపారు. ఆయన చొరవ విద్యా వ్యవస్థలో మంచి మార్పు తేనుందని కొనియాడారు.





జెలెన్‌స్కీకి ప్రధాని మోదీ ఫోన్

ఉక్రెయిన్‌లో శాంతి పరిష్కారానికి భారత్ సంపూర్ణ మద్దతు

ఢిల్లీ: రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో మానవతా దృక్పథానికి మద్దతునిస్తూ చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. శాంతియుత పరిష్కారం కనుగొనడానికి అవసరమైన అన్ని రకాల సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అమెరికా, రష్యా, ఉక్రెయిన్ మధ్య త్రైపాక్షిక శాంతి చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ, ప్రధాని మోదీ మధ్య ఫోన్ చర్చలు జరిగాయి. ఇటీవల యుద్ధంలో చోటుచేసుకున్న పరిణామాల గురించి ప్రధానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు వివరించారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవడంపైనా వారిద్దరూ చర్చించుకున్నారు. ఫోన్ చర్చల అనంతరం ప్రధాని కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

“జెలెన్‌స్కీతో ఫోన్‌లో ఫలవంతమైన చర్చలు జరపడం సంతోషాన్నిచ్చింది. ఇద్దరం ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్షించాం. మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాం. యుద్ధంపై వివరాలను ఆయన నాతో పంచుకున్నందుకు కృతజ్ఞతలు. శాంతియుత పరిష్కారం కోసం అవసరమయ్యే ప్రతి అంశంలోనూ సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉంది” అని ప్రధాని పేర్కొన్నారు.



“శాంతి, చర్చల విషయంలో భారత్ అంకితభావాన్ని అభినందిస్తున్నాం. ఈ దారుణ యుద్ధాన్ని ప్రపంచమంతా శాశ్వత శాంతితో గౌరవప్రదంగా ముగించాలని కోరుకుంటున్న ఈ సమయంలో భారత్ భాగస్వామ్యాన్ని స్వాగతిస్తున్నాం. నల్ల సముద్రంలో ఆహార ధాన్యాల సరఫరాను రష్యా అడ్డుకోవడంపై చర్చించాం. ఆహార కారిడార్లను ఏర్పాటు చేసే విషయంలో మధ్యవర్తిత్వానికి భారత్ సిద్ధంగా ఉంది. చర్చలే పరిష్కారమని గతంలో అనేకసార్లు పుతిన్‌కు మోదీ స్పష్టం చేశారు” అని సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులో జెలెన్‌స్కీ పేర్కొన్నారు.



ఐఫోన్ ఫ్యాక్టరీలో ప్రమాదం

ఊపిరాడక ముగ్గురు కార్మికులు దుర్మరణం

తమిళనాడు రాష్ట్రం హోసూర్ సమీపంలో ఉన్న ఐఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌లో విషాదం చోటు చేసుకుంది. ఇందులో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు ఊపిరాడక మరణించారు. విషపూరిత వాయువులు పీల్చి ఊపిరాడకపోవడమే వారి మరణాలకు కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనావేశారు. మెయింటనెన్స్ విభాగంలో పనిచేస్తున్న వీరు వ్యర్థజలాల శుద్ధీకరణ ట్యాంక్ వద్ద ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత ఓకార్మికుడు ట్యాంకు లోపలికి తొంగి చూసే క్రమంలో ఉన్నట్టుండి కుప్పకూలాడు. అతడికి ఏం జరిగిందో తెలుసుకునేందుకు వెళ్లిన క్రమంలో మరో ఇద్దరు కార్మికులు స్పృహ కోల్పోయారు. తోటి సిబ్బంది వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్లాంట్‌ను టాటా ఎలక్ట్రానిక్స్ నిర్వహిస్తోంది. తాజా ఘటనపై ఈ కంపెనీ నుంచి గానీ, యాపిల్ నుంచి గానీ ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే ఈ ఘటనపై కంపెనీ అంతర్గత దర్యాప్తుచేపట్టినట్టు సమాచారం. పోస్ట్‌మార్టం నివేదిక తర్వాతే మరణాలకుగల అసలు కారణం తెలుస్తుందని పోలీసు అధికారులు వెల్లడించారు.

2027 హజ్ యాత్రకు 1,75,020 మంది

భారతీయులకు అవకాశం

భారత్ నుంచి 2027 ఏడాదిలో హజ్ యాత్రకు 1,75,020 మంది వెళ్లనున్నారని జెద్దాలోని భారత కాన్సులేట్ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీనికి సంబంధించిన కోటా ఖరారుపై సౌదీ అరేబియాతో ద్వైపాక్షిక ఒప్పందం కుదిరినట్లు తెలిపింది. హజ్ యాత్రకు వెళ్లే భారత యాత్రికుల కోటా ప్రతిఏటా పెరుగుతోందని కాన్సులేట్ పేర్కొంది. 2014లో 1,36,020 మందికి మాత్రమే అనుమతి రాగా ఆ సంఖ్య క్రమంగా వృద్ధి చెందుతూ వస్తోంది.

డిజిటల్ అరెస్టులపై

‘సుప్రీం’ సీరియస్

సైబర్ నేరాల అడ్డుకట్టపై నివేదిక ఇవ్వాలని సోషల్ మీడియా కంపెనీలకు ఆదేశం

డిజిటల్ అరెస్టులపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల విషయంలో సోషల్ మీడియాసంస్థలకు కీలకఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ అరెస్ట్‌స్కామ్‌లు, సైబర్ నేరాల అడ్డుకట్టకు ప్రతిపాదిత చర్యలపై నివేదికఇవ్వాలని వాట్సాప్, ఇతర సోషల్ మీడియా సంస్థలను సుప్రీం కోర్టు ఆదేశించింది. తమ వద్ద ఉన్న సాంకేతిక నివారణ చర్యల వివరాలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కి కూడా సమర్పించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. బ్యాంకుల నిర్లక్ష్యం వల్ల ఖాతాదారులు సైబర్ ఫ్రాడ్‌లో డబ్బు పోగొట్టుకుంటే, ఆ నష్టాన్ని సదరు బ్యాంకులే భరించేలా ఆర్‌బీఐ నిబంధనలు తేవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుమోటోగా కేసు విచారణ జరిపింది. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల కట్టడికి వాట్సాప్‌తో పాటు బ్యాంకులు, పోలీసు విభాగా నికి కఠిన సూచనలు చేసింది. ఖాతాదారుల సాధారణ పరిమితికి భిన్నంగా పెద్దమొత్తంలో డబ్బు బదిలీ అవు తుంటే బ్యాంకులు ఎందుకు ఆపట్లేదని ప్రశ్నించింది. సైబర్ మోసాలపై నమోదైన ఎఫఐఆర్‌లు, దర్యాప్తు పురోగతి నివేదికలను సమర్పించాలని రాష్ట్రాలడీజీపీలకు సుప్రీంకోర్టు ఆదేశాలుజారీ చేసింది. ఆర్‌బీఐ కొత్త కేవైసీ మార్గదర్శకాలను స్వయంగా పరిశీలిస్తామని బెంచ్ వెల్లడించింది. తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది.



150 మీటర్ల ఎత్తులో కరెంట్ వైర్లకు చిక్కుకున్న పారా గ్లైడర్



హిమాచల్ ప్రదేశ్‌లో ఒక పారా గ్లైడర్ సుమారు 150 మీటర్ల ఎత్తులోని హైటెన్షన్ విద్యుత్ వైర్లకు చిక్కుకుపోవడం తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు సుమారు మూడు గంటల పాటు శ్రమించి అతడిని సురక్షితంగా కిందకు తీసుకువచ్చాయి. ఆ పారాగ్లైడర్‌ను రష్యాకు చెందిన అలెక్సీగా అధికారులు గుర్తించారు.

కాంగ్రా జిల్లాలోని బీర్ బిల్లింగ్ ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా పారా గ్లైడింగ్‌కు ఎంతో ప్రసిద్ధి చెందింది. రష్యాకు చెందిన అలెక్సీ అనే పైలట్ మంగళవారం ఇక్కడి నుంచి గ్లైడింగ్ మొదలుపెట్టారు. ఈ క్రమంలో హైవే మీదుగా ఉన్న హైటెన్షన్ వైర్లకు చిక్కుకుపోయారు. తన మొబైల్ ఫోన్ ద్వారా ఈ విషయాన్ని నిర్వాహకులకు తెలియజేయడమే కాకుండా, పైనే వేలాడుతూ అందుకు సంబంధించిన ఫొటోలు, లోకేషన్‌ను వారికి పంపించారు.

సమాచారం అందుకున్న వెంటనే అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. భారీ క్రేన్లతో పాటు సహాయక చర్యలకు అవసరమైన పరికరాలను అక్కడికి చేర్చారు. ఎన్‌హెచఏఐ, ఎస్‌డీఆరఎఫ్, ఎన్‌డీఆరఎఫ్ సహా ఒక నిర్మాణ సంస్థ కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహించాయి. భారత వాయుసేన సహకారాన్ని కూడా జిల్లా అధికారులు కోరినప్పటికీ.. వారి సాయం లేకుండానే క్రేన్ ద్వారా అతడిని సురక్షితంగా కిందకు దించారు.

భారత్‌పై చైనీస్ వ్లాగర్ల దుష్ప్రచారం

విదేశాంగ శాఖ తీవ్ర ఆగ్రహం



భారత్‌కు వ్యతిరేకంగా కొంతమంది చైనీస్ వ్లాగర్లు సామాజిక మాధ్యమాల వేదికగా విష ప్రచారం చేయడం ఇటీవల తీవ్ర వివాదాస్పదమైంది. బంగ్లాదేశ్‌లోని మురికివాడలను ఢిల్లీకి చెందినవి అని పేర్కొంటూ వారు చేసిన లైవ్ స్ట్రీమింగ్‌పై భారత విదేశాంగ శాఖ (వీజూూ) తీవ్రంగా స్పందించింది. అది దురదృష్టకర ఘటనా వికాసమని పేర్కొంది. ఇటీవల కొంతమంది చైనీస్ వ్లాగర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో భారత్‌లోని జీవన స్థితిగతులపై వీడియోలు పోస్ట్ చేశారు. ఢాకాలోని మురికివాడల దృశ్యాలను చూపిస్తూ.. అవన్నీ ఢిల్లీ ప్రాంతాలని అసత్య ప్రచారం చేశారు. దాదాపు 150 మంది చైనీస్ జాతీయులు ఈ వీడియోలను రికార్డు చేసినట్లు సమాచారం అందింది.

వీటిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో స్పందించారు. “ఈ విషయంపై మీడియాలో వచ్చిన నివేదికలను చూశాం. ఏ దేశాన్నయినా వక్రీకరించి చూపించే ఇలాంటి ప్రయత్నాలు దురదృష్టకరం. విదేశీ వ్యక్తుల సాయంతో కొంతమంది ఢాకాను ఢిల్లీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు అనిపిస్తోంది. అయితే, ఇలాంటి తప్పుడు కథనాలతో వారు విశ్వసనీయతను కోల్పోతారనే విషయం గుర్తుంచుకోవాలి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నాం” అని ఆయన పేర్కొన్నారు.



దోమల భరతం పట్టే ఏఐ డ్రోన్లు

గుజరాత్ కుర్రాళ్ల ఆవిష్కరణకు గేట్స్ ఫౌండేషన్ ఫిదా

మెహసానా: గుజరాత్‌లోని మెహసానాకు చెందిన ఇద్దరు యువకులు దోమల సంతానోత్పత్తి కేంద్రాలను గుర్తించే ఏఐ ఆధారిత డ్రోన్లను అభివృద్ధి చేశారు. ప్రైమ్ యూఏవీ సంస్థ రూపొందించిన ఈ డ్రోన్లు మురుగు నీరు, ఎత్తైన భవనాలు, పై కప్పులు, మనుషులు చేరుకోలేని ప్రాంతాల్లో దోమల ఆవాసాలను క్షణాల్లో గుర్తిస్తాయి. ఈ సమాచారాన్ని అధికారులకు లైవ్‌లో పంపడంతోపాటు అవసరమైన చోట పురుగుల మందు పిచికారీ చేస్తాయి.సంస్థ వ్యవస్థాపకుడు ప్రదీప్ పటేల్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. 2021లో పరిశోధనలు ప్రారంభించిన సంస్థ గాంధీనగర్ పరిధిలో 3,500కు పైగా దోమల స్థావరాలను గుర్తించింది. బిల్ అండ్ లిండా గేట్స్ ఫౌండేషన్ బృందం ఈ టెక్నాలజీని పరిశీలించింది. కరోనా సమయంలో పోలీసు, ఆరోగ్య శాఖలకు డ్రోన్లతో సహకరించిన సంస్థ అడవుల్లో సీడ్ బాల్స్ చల్లడం వంటి కార్యక్రమాలను కూడా చేపట్టింది.



కొత్త పాస్‌పోర్ట్ ఇవ్వండి

షేక్ హసీనా అభ్యర్థనను తోసిపుచ్చిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

ఢాకా: తనకు కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాల్సిందిగా బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆ దేశ ప్రభుత్వాన్ని కోరినట్టు అవామీ లీగ్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబరులో స్వదేశానికి తిరిగి వచ్చేందుకే ఆమె ఈ అభ్యర్థన చేసినట్టు ఆ వర్గాలు తెలిపాయి. అయితే హసీనా విజ్ఞప్తిని బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్రంగా తోసిపుచ్చింది. ఆమె డ్రామా చేస్తున్నారని, భారత్ ప్రభుత్వం ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయూన్ కబీర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు పాస్‌పోర్ట్‌లు జారీ చేసే అనవాయితీ తమ దేశంలో లేదని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ చర్యలు-నేపథ్యం:

79 ఏళ్ల హసీనా పదవి నుంచి దిగిపోయాక ఏర్పాటైన మధ్యంతర ప్రభుత్వం ఆమె పాస్‌పోర్ట్‌ను, జాతీయ గుర్తింపు కార్డును రద్దు చేసింది.

ఈ నేపథ్యంలో ఆమె తన తరపున ఆ పత్రాలను సత్వరం జారీ చేయాల్సిందిగా భారత్‌లోని బంగ్లాదేశ్ హైకమిషన్‌ను తన న్యాయ ప్రతినిధి 'మ్యాట్రిక్స్ ఛాంబర్స్' ద్వారా కోరినట్టు తెలిసింది.

2024 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో చెలరేగిన ఉద్యమ ఫలితంగా హసీనా ప్రభుత్వం పతనమైంది. అప్పటి నుంచి ఆమె స్వదేశం నుంచి పారిపోయి భారత్‌లో తలదాచుకుంటున్నారు. ఆమె పదవి నుంచి దిగిపోయాక నోబెల్ బహుమతి గ్రహీత ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. తదనంతరం జరిగిన ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) ఘన విజయం సాధించి... షేక్ హసీనా చిరకాల ప్రత్యర్థి ఖాలిదా జియా కుమారుడు తారిఖ్ రహమాన్ ప్రభుత్వం ఏర్పాటు చేశారు.



అమెది ఆర్భాటమే:

మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్వదేశానికి తిరిగి వచ్చే ఉద్దేశం లేదని బంగ్లాదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. తిరిగి వస్తానంటూ ఆమె చేస్తున్న ఆర్భాటం కేవలం రాజకీయ విన్యాసంలో భాగమేనని చీఫ్ ప్రాసిక్యూటర్ ముహమ్మద్ అమీనుల్ ఇస్లాం తెలిపారు. బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చేందుకు చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలను ఆమె తీసుకోవట్లేదని ఆయన పేర్కొన్నారు.

ఇరాన్‌పై యుద్ధానికి సై: ట్రంప్

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి అంతర్జాతీయంగా ఆందోళనలు కలిగిస్తున్నాయి. అణ్వాయుధాల తయారీ విషయంలో ఇరాన్ ఎలాంటి ప్రయత్నాలు చేసినా సహించబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. అమెరికా సైన్యం పూర్తి సన్నద్ధంగా ఉందని చెబుతూ.. తమ బలగాలు 'లాక్డ్ అండ్ లోడెడ' స్థితిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇరాన్ అణ్వాయుధాలను పొందకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టం చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటానికి అనుమతించబోమని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల వైట్‌హౌస్‌లో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్ విషయంలో అవసరమైతే పూర్తి చర్యలు తీసుకునేందుకు అమెరికా సిద్ధంగా ఉందని చెప్పారు.

సైనిక సామగ్రి, ఆయుధాల తయారీని కూడా అమెరికా పెంచుతోందని వెల్లడించారు. దాడికి తమ సైన్యం పూర్తి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అమెరికా హెచ్చరికలకు ఇరాన్ కూడా గట్టిగానే స్పందిస్తోంది. అమెరికా మరోసారి దాడులకు దిగితే తమ సైన్యం వెంటనే ప్రతీకారం తీర్చుకుంటుందని ఇరాన్ సైనిక ప్రతినిధి మహమ్మద్ అక్రమినియా



హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో గతంలో జరిగిన ప్రత్యక్ష ఘర్షణల నుంచి తమ సైన్యం అనుభవం సంపాదించిందని, ప్రస్తుతం మరింత అప్రమత్తంగా ఉందని తెలిపారు. అమెరికా దాడులకు భౌగోళిక పరిమితులు లేకుండా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు.

శ్వేతసౌధం సమీపంలో కారు బీభత్సం



అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసం శ్వేత సౌధానికి కొద్ది దూరంలో ఓ వ్యక్తి కారుతో స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ముందు జాగ్రత్తగా శ్వేతసౌధాన్ని కొంతసేపు లాక్‌డౌన్ చేశారు. శ్వేతసౌధంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్న సమయంలోనే ఈ ఘటన జరిగింది. ఘటన అనంతరం సీక్రెట్ సర్వీసు అధికారులు, నేషనల్ గార్డ్ ఆ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో భద్రతా సిబ్బందిని డ్రైవర్ ప్రతిఘటించినట్టు కూడా తెలిసింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం... లాఫాయెట్ స్క్వేర్ వద్ద ఫుట్‌పాత్‌పై కారులో దూసుకొచ్చిన డ్రైవర్ అక్కడున్న స్తంభాన్ని ఢీకొట్టాడు. వెంటనే కారులోంచి దట్టమైన పొగలు వచ్చాయి. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10 ఈ ఘటన జరిగింది. ఈ నేపథ్యంలో సీక్రెట్ సర్వీస్ సిబ్బంది సూచనల మేరకు శ్వేతసౌధాన్ని కొంతసేపు లాక్‌డౌన్ చేశారు. అధికారులు ఆ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ వివరాలను మాత్రం ఇంకా వెల్లడించలేదు. అసలు ఆ సమయంలో ఏం జరిగింది? డ్రైవర్ లక్ష్యం ఏమిటి? అన్న విషయాలపై స్పష్టత లేదు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా? కావాలనే కారును క్రాష్ చేశారా? అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

సీఈవోపై దర్యాప్తు ఎఫెక్ట్

ఒక్కరోజులో ఎన్విడియా మార్కెట్ విలువ రూ.17లక్షల కోట్లు ఆవిరి!


ప్రపంచంలోనే అత్యంత విలువైన టెక్ కంపెనీల్లో ఒకటైన ఎన్విడియాకు ఒక్కరోజులో భారీ నష్టం వాటిల్లింది. ఆ సంస్థ సీఈవో జెన్సన్ హువాంగ్‌పై వచ్చిన వివాదాస్పద ఆరోపణలు, కంపెనీ బోర్డు ప్రారంభించిన అంతర్గత దర్యాప్తు ఇన్వెస్టర్లలో ఆందోళనకు కారణమయ్యాయి. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్‌లో సోమవారం ఎన్విడియా షేర్లు 4.27 శాతం పడిపోయాయి. ఈ పతనంతో కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 190 బిలియన్ డాలర్లు (రూ.17 లక్షల కోట్లకు పైగా) తగ్గిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి ఒక్కో షేరు ధర 7.97 డాలర్లు తగ్గి 178.67 డాలర్ల వద్ద స్థిరపడింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి ఎన్విడియా మార్కెట్ విలువ సుమారు 4.5 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. సోమవారం ట్రేడింగ్‌లో ఒక దశలో షేర్లు 7.5 శాతం వరకు పడిపోవడంతో కంపెనీ మార్కెట్ విలువ భారీగా తగ్గింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. మార్కెట్ ముగిసే



సమయానికి షేరు ధర 4.27 శాతం తగ్గి 178.67 డాలర్లకు చేరింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 190 బిలియన్ డాలర్లు ఆవిరయ్యాయి. భారత కరెన్సీలో ఈ మొత్తం రూ.17 లక్షల కోట్లకు పైమాటే.

వందేళ్ల తర్వాత..

భారత్‌కు వస్తున్న 39 మంది నాగా పూర్వీకుల అవశేషాలు



వందేళ్లకుపైగా తమ మ్యూజియంలో భద్రపరిచిన నాగా తెగలకు చెందిన 39 మంది పూర్వీకుల అవశేషాలను యూకేలోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తిరిగి అప్పగించింది. పిట్ రివర్స్ మ్యూజియంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో 'ఫోరం ఫర్ నాగా రికన్సిలియేషన్, నాగా హోహో సంస్థలకు ఈ అవశేషాలను అధికారికంగా అందజేసింది. వాటిని నాగాలాండ్‌కు తరలిస్తున్నట్టు ఎఫఎనఆర్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈ అప్పగింతను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి, నాగా ప్రజలకు మధ్య ఉన్న సంబంధాల్లో ఓ చరిత్రాత్మక ఘట్టంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఐరీన్ ట్రేసీ అభివర్ణించారు. బ్రిటిష్ వలస పాలనలో తన సొంత గ్రామాన్ని ఎలా తగులబెట్టారో ఎఫఎనఆర్ ప్రతినిధి వైసియర్ సాన్యు గుర్తు చేసుకున్నారు. ఇదిలావుంటే నాగాలాండ్ రాజధాని కోహిమాలోని 'నాగా సాలిడారిటీ పార్క్'లో ఆ అవశేషాల ఖననం కోసం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

అంతర్జాతీయ సంక్షోభాలపై 'జీ7' కీలక చర్చలు

నేతల దృష్టి ట్రంప్ వైఖరిపైనే

పారిస్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పలు కీలక సంక్షోభాలను పరిష్కరించే మార్గాలపై జీ7 (+7) దేశాలు పారిస్‌లో విస్తృత చర్చలు ప్రారంభించాయి. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరుగుతున్న ఈ భేటీకి అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాల విదేశాంగ మంత్రులు హాజరయ్యారు. ఇటీవల జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘోరంగా ఓడిపోయిన నేపథ్యంలో అంతర్జాతీయ అంశాలపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి ఎలా ఉంటుందనే విషయమై విదేశాంగ వర్గాల్లో తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌తో అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా రోజురోజుకూ పెరుగుతున్న చమురు ధరలు, కృత్రిమ మేధ (ఏఐ) సవాళ్లు తదితర కీలక సమస్యలపై ట్రంప్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, ఆయన అవలంబించే వైఖరే అత్యంత కీలకం కానున్నాయని ప్రతినిధులు పేర్కొంటున్నారు.

తుర్కియేలో ఐక్యరాజ్యసమితి 31వ 'వాతావరణ మార్పు' సదస్సు ప్రారంభం

ఇస్తాంబుల్: 31వ ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పు సదస్సు తుర్కియేలోని అంతాల్యాలో ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 20 వరకు కొనసాగనున్న ఈ సదస్సులో 196 దేశాలు, యూరోపియన్ యూనియన్ (మొత్తం 197 పక్షాలు) నుంచి దేశాధినేతలు, పర్యావరణ కార్యకర్తలు, ఇతర ప్రతినిధులు పాల్గొంటున్నారు. 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ 31' (సీఓపీ-31)గా ప్రసిద్ధమైన ఈ సమావేశం.. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరలు ఆకాశాన్నంటిన కీలక దశలో జరుగుతోంది. విద్యుత్ వినియోగ యుగంలోకి మారడమో లేదా శిలాజ ఇంధన ధరల పెరుగుదల భారం కుటుంబాల వెన్ను విరగ్గొట్టడాన్ని ఆమోదించడమో నిర్ణయించుకోవాల్సిన తరుణంలో ఈ సదస్సు జరుగుతోందని పర్యావరణ కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు.

ఐపీఎల్‌లో మరో రెండు కొత్త జట్లు

బీసీసీఐ ప్లాన్ అదేనా!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మరోసారి జట్ల సంఖ్య పెరగనుందా? అంటే అవుననే సంకేతాలు కనిపిస్తున్నాయి. 2028 సీజన్ నుంచి ఐపీఎల్‌లో మరో రెండు కొత్త ఫ్రాంచైజీలను చేర్చాలని బీసీసీఐ యోచిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం పుణె, వడోదర నగరాలను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే దీనిపై బోర్డు ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రాథమిక దశలోనే ఉందని వార్తలు వస్తున్నాయి.

ఒక్కో జట్టు విలువ రూ.వేల కోట్లు!

ఐపీఎల్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ, ఫ్రాంచైజీల విలువ భారీగా పెరగడంతో కొత్త జట్ల ఏర్పాటుపై పెట్టుబడిదారుల్లో ఆసక్తి నెలకొన్నట్టు సమాచారం. కొత్తగా వచ్చే ఒక్కో ఫ్రాంచైజీ విలువ 100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8,800 కోట్లకు పైగా) చేరవచ్చని అంచనా. 2028 నుంచి 2032 వరకు అమల్లోకి రానున్న తదుపరి మీడియా హక్కుల ఒప్పందంతో ఈ విస్తరణకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రముఖ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ పెర్మిరా, పశ్చిమాసియా సావరిన్ వెల్త్ ఫండ్స్, ఆసియా ప్రభుత్వ పెట్టుబడి సంస్థలు, అమెరికాకు చెందిన ఫ్యామిలీ ఆఫీసులు, భారతీయ పారిశ్రామిక సంస్థలు కొత్త జట్లపై ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. కొంతమంది అత్యంత సంపన్నులు కూడా మైనారిటీ వాటాల రూపంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

పుణెకు ఐపీఎల్‌తో పాత అనుబంధం!

కొత్త ఫ్రాంచైజీల కోసం పరిశీలిస్తున్న పుణె నగరానికి ఐపీఎల్‌తో ఇప్పటికే అనుబంధం ఉంది. 2011 నుంచి 2013 వరకు పుణె వారియర్స్ ఇండియా జట్టు టోర్నీలో పాల్గొంది. అయితే బీసీసీఐతో ఆర్థిక వివాదం కారణంగా ఆ జట్టు ఐపీఎల్ నుంచి తప్పుకుంది. ఆ తర్వాత 2016, 2017 సీజన్లలో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్ జట్టు బరిలోకి దిగింది. 2017లో ఫైనల్‌కు చేరిన ఆ జట్టు.. ముంబై ఇండియన్స్ చేతిలో కేవలం ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. ఇక వడోదరను కొత్త ఫ్రాంచైజీ కేంద్రంగా ఎంపిక చేస్తే గుజరాత్ క్రికెట్‌కు మరింత ప్రాధాన్యం లభించనుంది. ఐపీఎల్‌లో చివరిసారిగా 2022 సీజనుకు ముందు జట్ల సంఖ్య పెరిగింది. అప్పుడు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ కొత్త ఫ్రాంచైజీలుగా టోర్నీలోకి అడుగుపెట్టాయి. దీంతో మొత్తం జట్ల సంఖ్య పదికి చేరింది. ఇప్పుడు మరో రెండు జట్లు వస్తే ఐపీఎల్‌లో జట్ల సంఖ్య 12కు పెరిగే అవకాశం ఉంది.

సెమీస్‌కు భారత్



అండర్-19 ఆసియా కప్‌లో యూఏఈపై ఘన విజయం

అండర్ 19 ఆసియా కప్‌లో యూఏఈపై భారత్ 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 310 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన యూఏఈ జట్టు.. 239 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత జట్టు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. భారత బౌలర్ ఇషాన్ సూద్ 4 వికెట్లతో చెలరేగి.. యూఏఈ బ్యాటర్ల పతనాన్ని శాసించాడు. అయితే ఓవైపు వికెట్లు పడుతున్నా యూఏఈ బ్యాటర్ అహ్మద్ (74) ఒంటరి పోరాటం చేశాడు. అయినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. నూరుల్లా ఆయోబి (39), యాయిన్ రాయ్ (29), అయాన్ (27) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. జైనుల్లా (16), మహ్మద్ నఫీజ్ (14), బిలాల్ ఖాన్ (0), ఉద్దిశ్ (13), మొహమ్మద్ సాద్ (3), హదాయాతుల్లా (0) పరుగులు చేశారు. భారత బౌలర్లలో బౌలింగ్ వేసిన ప్రతి ఒక్కరూ వికెట్ తీశారు. ఇషాన్ సూద్ 4, మోహిత్, మనాల్, కావ్య పటేల్, యశ్‌బర్దన్, ఆర్యన్, అర్జున్ తలొక వికెట్ చొప్పున పడగొట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత యువ జట్టు.. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 309 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆర్యవీర్ సెహ్వాగ్ (160) భారీ సెంచరీ, వీకే వినీత్ (67) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. కెప్టెన్ లక్ష్య రాజేశ్ (17), అర్జున్ రాజ్‌పుత్ (4), యశ్‌బర్దన్ చౌహాన్ (17), అన్వయ్ ద్రవిడ్ (12), మనాల్ చౌహాన్ (1) పరుగులు చేశారు. మోహిత్ (7), ఆర్యన్(2) నాటౌట్‌గా నిలిచారు. యూఏఈ బౌలర్లలో నసీం ఖాన్ 4 వికెట్లతో చెలరేగగా.. హదాయాతుల్లా, నూరుల్లా, అయాన్ మిస్బా తలొక వికెట్ చొప్పున పడగొట్టారు.

శాండ్‌పేపర్ గేట్ వివాదం

ఆత్మకథలో సంచలన విషయాలు బయటపెట్టిన ఉస్మాన్ ఖవాజా



సంచలనం సృష్టించిన 'శాండ్‌పేపర్ గేట' (బాల్ టాంపరింగ్) వివాదంపై ఆస్ట్రేలియా క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ పుస్తకంలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ ఘటనలో కేవలం ముగ్గురిని మాత్రమే బాధ్యులను చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఖవాజా చేసిన ఈ వ్యాఖ్యలపై డేవిడ్ వార్నర్ స్పందిస్తూ... బాల్ టాంపరింగ్ వివాదంలో ఖవాజా చెప్పినవన్నీ వంద శాతం వాస్తవమేనని స్పష్టం చేశారు. ఈ పుస్తకంలో శాండ్‌పేపర్ వాడిన తీరుపై ఖవాజా మరికొన్ని అంశాలను ప్రస్తావించారు. "మేము జట్టుగా ఈ తప్పు చేశాం. చాలా ఏళ్లు దీని గురించి మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉన్నాం. ఇక్కడ ఎవరినీ వ్యక్తిగతంగా అనడం లేదు. మూడో టెస్టులో సఫారీ (దక్షిణాఫ్రికా) బౌలర్లు 25 ఓవర్లలోపే రివర్స్ స్వింగ్ రాబట్టారు. మాకు మాత్రం 50 ఓవర్లు అయినా సరే రాలేదు. విరామం అనంతరం బాన్‌క్రాఫ్ట్ మైదానంలోకి వచ్చి బంతి ఆకారం కాస్త మార్చాడు. అప్పుడు మా బౌలర్లు అదరగొట్టారు. ఆ సెషన్‌లో మేము దక్షిణాఫ్రికా బ్యాటర్లను చిత్తు చేశాం. శాండ్‌పేపర్‌తో బంతి ఒకవైపు గరుకుగా, పొడిగా మారింది. గల్లీలో ఉండే నా వద్దకు బంతి వచ్చాక దాన్ని నిశితంగా పరిశీలించా. నేను కూడా ఈ బంతితో రివర్స్ స్వింగ్ చేయగలనని అనిపించేది. మా బౌలర్లు సూపర్‌గా బౌలింగ్ చేశారు. కేవలం 28 పరుగులకే నాలుగు వికెట్లు తీశారు. బంతి ఎంతలా స్వింగ్ అవుతోందంటే... వికెట్ పడిన తర్వాత మా ప్లేయర్లలో ఒకరు అన్న మాటలు ఇంకా గుర్తున్నాయి. 'ఈ బంతిని ఇంకేమీ చేయొద్దు, అద్భుతంగా స్వింగ్ అవుతోంది, పిచ్చెక్కిపోతోంది' అని అన్నాడు. ఆ మాటలకు మేమంతా నవ్వేశాం" అని నాటి ఘటనను ఖవాజా గుర్తు చేసుకున్నారు.

మూడో వన్డే వర్షార్పణం

టాస్ తర్వాతా వరుణుడి ఆట.. చివరకు రద్దయిన భారత్-న్యూజిలాండ్ మ్యాచ్



హామిల్టన్: న్యూజిలాండ్‌తో మూడో వన్డేకు వరుణుడు తీవ్ర అంతరాయం కలిగించాడు. పలుమార్లు వర్షం తగ్గుతూ.. మళ్లీ మొదలవడంతో మ్యాచ్ ప్రారంభం కాలేదు. చివరకు ఎంతసేపు ఎదురుచూసినా వాతావరణం అనుకూలించకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే హామిల్టన్‌లో వర్షం పడటంతో టాస్ ఆలస్యమైంది. పలుమార్లు వర్షం తగ్గడంతో మైదాన సిబ్బంది కవర్లు తొలగించి ఆటకు ఏర్పాట్లు చేశారు. అయితే టాస్ నిర్వహించేందుకు సిద్ధమైన సమయంలో మళ్లీ చిరుజల్లులు మొదలయ్యాయి. చివరకు వర్షం కొంత విరామం ఇవ్వడంతో టాస్ నిర్వహించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ జట్టులో ఒక మార్పు చేసినట్లు ప్రకటించాడు. మాథ్యూ ఫిషర్‌కు అవకాశం కల్పించి బ్లెయిర్ టిక్నర్‌ను తప్పించాడు. అయితే టాస్ పూర్తయిన వెంటనే మళ్లీ వర్షం మొదలైంది. దీంతో పిచ్‌ను మరోసారి కవర్లతో కప్పేశారు. వర్షం ఆగుతుందేమోనని అంపైర్లు, ఆటగాళ్లు, అభిమానులు చాలాసేపు ఎదురుచూశారు. మధ్యలో వర్షం కొంత తగ్గినప్పటికీ మళ్లీ జోరందుకుంది. మైదానంలో నీరు చేరడంతో ఆట నిర్వహించేందుకు పరిస్థితులు అనుకూలించలేదు. చివరకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మ్యాచ్ రద్దుతో సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలిచినా సిరీస్‌ను 2-2తో సమం చేయగలదు. అయితే సిరీస్‌ను గెలిచే అవకాశం మాత్రం ఆ జట్టుకు లేకుండా పోయింది. మరోవైపు భారత్ తదుపరి మ్యాచ్‌లో విజయం సాధిస్తే ఆధిక్యాన్ని మరింత పెంచుకోనుంది.

టీమిండియాకు గుడ్ న్యూస్

న్యూజిలాండ్ బయల్దేరనున్న రిషభ్ పంత్



న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు భారీ ఊరట లభించనుంది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ త్వరలోనే పూర్తి ఫిట్‌నెస్ సాధించి భారత జట్టుతో కలవనున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి పంత్‌కు ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభించే అవకాశం ఉందని సమాచారం. ఈ క్రమంలో నవంబరు 12న అతడు న్యూజిలాండ్‌లోని వెల్లింగ్టన్‌కు బయలుదేరనున్నట్లు తెలుస్తోంది. కాగా ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న టీమిండియా.. నవంబరు 19 నుంచి ఆతిథ్య జట్టుతో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా తరపున ఆడుతున్న సమయంలో పంత్ పక్కటెముకల గాయానికి గురయ్యాడు. దీంతో అతడిని తొలుత అనధికారిక టెస్టు కోసం ప్రకటించిన ఇండియా-ఎ జట్టులో ఎంపిక చేశారు. అయితే బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ లభించకపోవడంతో జట్టుతో కలవలేకపోయాడు. తాజాగా పంత్ పూర్తిగా కోలుకున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అతడు మ్యాచ్ సిమ్యులేషన్ డ్రిల్స్‌లో పాల్గొంటున్నాడు. మంగళవారం ఒక సెషన్ పూర్తి చేయగా... బుధవారం మరో రౌండ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ రెండింటినీ విజయవంతంగా పూర్తి చేస్తే 12న వెల్లింగ్టన్ బయల్దేరతాడని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

పీటీ ఉషకు షాక్

ఎసఓఎం ఎన్నికల్లో ఓటమి


ఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషకు తీవ్ర నిరాశ ఎదురైంది. మహిళల 'స్పోర్ట్స్ పర్సన్స్ ఆఫ్ మెరిట' (ఎసఓఎం) ఎన్నికల్లో ఆమె ఓటమిపాలయ్యారు. నలుగురి ఎన్నిక కోసం ఆరుగురు బరిలో నిలవగా.. మాజీ క్రీడాకారులు సైనా నెహ్వాల్ (బ్యాడ్మింటన్), అంజు బాబీ జార్జ్ (లాంగ్‌జంప్), డోలా బెనర్జీ (ఆర్చరీ), రాణి రాంపాల్ (హాకీ) విజేతలుగా నిలిచారు. ఈ ఎన్నికల్లో పీటీ ఉష 40 ఓట్లతో ఐదో స్థానంలో నిలిచారు. 40 మంది పురుష క్రీడాకారులు, 40 మంది మహిళా ప్లేయర్లు ఓటింగ్‌లో పాల్గొనగా... అంజు బాబీ జార్జ్ (53)కు అత్యధిక ఓట్లు లభించాయి. రాణి రాంపాల్ (50), డోలా బెనర్జీ (45), సైనా నెహ్వాల్ (43) ఆ తర్వాతి స్థానాలు దక్కించుకుని ఎసఓఎంలుగా ఎన్నికయ్యారు. మరో పోటీదారు బాస్కెట్‌బాల్ ప్లేయర్ అనిత పాల్‌కు కేవలం ఆరు ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

అధ్యక్ష పదవికి దారులు బంద్?

ఐఓఏ నియామావళి ప్రకారం అధ్యక్ష పదవికి పోటీపడాలంటే ఎసఓఎంగా ఎన్నికవ్వాలి... లేదంటే ఏదైనా క్రీడా సమాఖ్య వారిని నామినేట్ చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఉషను ఏ క్రీడా సమాఖ్యా నామినేట్ చేసే అవకాశం కనిపించడం లేదు. మరోవైపు, పురుషుల విభాగంలో గగన్ నారంగ్, విజేందర్ సింగ్, యోగేశ్వర్ దత్, కమ్లేష్ మెహతా ఎసఓఎంలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐఓఏ నూతన కార్యవర్గం కోసం డిసెంబరు 5న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఐఓఏ జనరల్ అసెంబ్లీలో భాగమైనవారు ఈ ఎన్నికల్లో ఓటేసేందుకు, పోటీపడేందుకు అర్హులు. ప్రతి జాతీయ క్రీడా సమాఖ్య నుంచి ఇద్దరు ప్రతినిధులు, ఎనిమిది మంది ఎసఓఎమ్‌లు, అథ్లెటిక్స్ కమిషన్ నుంచి ఇద్దరు, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రతినిధి ఒకరు ఈ జనరల్ అసెంబ్లీలో సభ్యులుగా ఉంటారు.

చైతన్య రథం
సినిమా
బుధవారం 11 నవంబరు 2026 X

ఇస్కాన్ వ్యవస్థాపకుడి జీవిత కథగా... 'శరణాగతి'



'శరణాగతి–ది లైఫ్ ఆఫ్ ఏ సరెండర్డ్ సోల' పేరుతో ఒక భారీ యానిమేటెడ్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు వెల్లడించింది. ఇస్కాన్ వ్యవస్థాపకుడు ఏసీ భక్తివేదాంత స్వామి ప్రభుపాద జీవిత ప్రయాణం ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అత్యాధునిక ఏఐ మోషన్ క్యాప్చర్ సాంకేతికతను ఉపయోగించి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి పరిచయం చేసిన ప్రభుపాదుల జీవిత విశేషాలను ఇందులో చూపించనున్నారు. 2027 ఆగస్టులో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు.

కేజీఎఫ్, కాంతార వంటి దిగ్విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. ట్రాన్స్‌సెండెంటల్ ఫిల్మ్స్‌తో కలిసి

అపజయాలే ఎక్కువ పాఠాలు నేర్పుతాయి: సమంత



వ్యాపార భాగస్వామ్యం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయితే మొదటిసారి పెట్టిన పెట్టుబడి విఫలమవడం కూడా మంచిదే. ఎందుకంటే విజయాల కంటే అపజయాలే ఎక్కువ నేర్పిస్తాయి. నా జీవితంలో నేర్చుకున్న పాఠాలన్నీ వైఫల్యాల నుంచి వచ్చినవే. విజయాలు నాకు పెద్దగా ఏమీ నేర్పించలేదు" అని సమంత చెప్పుకొచ్చారు. ఇదే షోలో వ్యాపార రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపైనా ఆమె మాట్లాడారు. "కొత్తగా ఏదైనా ప్రారంభించాలంటే మహిళల్లో భయం ఎక్కువగా ఉంటుంది. మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడం నాకు కొత్త అనుభవం. ఇప్పటివరకు నేను దాదాపు 8–10 వ్యాపార సంస్థల్లో పెట్టుబడి పెట్టాను. వాటిలో ఎనిమిది సంస్థలకు మహిళలే వ్యవస్థాపకులుగా ఉండడం ఎంతో సంతోషకరమైన విషయం" అని వివరించారు. కాగా ప్రస్తుతం సమంత 'సెలబ్రిటీ మాస్టర్‌షెఫ్ తమిళం' షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

జీవితంలో విజయాల కంటే అపజయాలే ఎక్కువ నేర్పిస్తాయని ప్రముఖ నటి సమంత పేర్కొన్నారు. తాజాగా ఓ షోలో పాల్గొన్న ఆమె బిజినెస్‌లో ఎదురైన విఫల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఆ ఓటమి తనకు అనేక పాఠాలు నేర్పిందని తెలిపారు. "నా తొలి

రావణుడి పాత్రకు ఏకంగా 33 కిలోల దుస్తులు, ఆభరణాలు



నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామాయణ' చిత్రంలో రావణుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన లుక్ గురించి చిత్ర కాస్ట్యూమ్ డిజైనర్ సానియా సర్దారియా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ పాత్ర కోసం యశ్ ధరించిన దుస్తులు, ఆభరణాల బరువు ఏకంగా 33 కిలోలు ఉందని ఆమె వెల్లడించారు. "ఈ సినిమాలో యశ్ సాధారణంగా ధరించిన దుస్తులు, ఆభరణాల బరువు 16 నుంచి 20 కిలోల వరకు ఉంటుంది. అయితే లంకకు సంబంధించిన రావణుడి లుక్, వివాహ వేడుకల కోసం రూపొందించిన కొన్ని ప్రత్యేక దుస్తుల బరువు మాత్రం 30 నుంచి 33 కిలోల వరకు ఉండేది. ఆయన ధరించిన కిరీటం ఒక్కటే 1.8 కిలోల బరువు ఉంది" అని సానియా వివరించారు.

'వారణాసి' కోసం మైత్రి మూవీ మేకర్స్ బిగ్ డీల్



టాలీవుడ్‌లో ప్రస్తుతం ఎక్కడ చూసినా దర్శకధీరుడు ఎసఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా గురించే చర్చ నడుస్తోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన బిజినెస్ వ్యవహారాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ సినిమా బిజినెస్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమా తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషల్లోని తెలుగు వెర్షన్ థియేట్రికల్ హక్కుల కోసం దాదాపు రూ.290 కోట్ల రికార్డు ధర చెల్లించినట్లు సమాచారం. ఇదే నిజమైతే తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత భారీ స్థాయి థియేట్రికల్ డీల్స్‌లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. నిర్మాతలు లేదా మైత్రి మూవీ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మరోవైపు ఇతర ప్రాంతాల థియేట్రికల్ హక్కులు, డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల విక్రయాల విషయంలో కూడా భారీ స్థాయిలో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.

ఈ వ్యవహారాలను దర్శకుడు రాజమౌళి స్వయంగా పర్యవేక్షిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. సినిమాను కేవలం భారతీయ ప్రేక్షకులకే పరిమితం చేయకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ భారీ స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారట. ఇంగ్లీష్‌తో పాటు ఇతర విదేశీ భాషల్లోనూ 'వారణాసి'ని విడుదల చేసేందుకు గ్లోబల్ స్టూడియోలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ప్రచారం సాగుతోంది. డిజిటల్ హక్కులు, ఓవర్సీస్ బిజినెస్, ఇతర భాషల మార్కెట్ కలిపి ఈ సినిమా మొత్తం బిజినెస్ మరింత భారీ స్థాయికి చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

త్వరలో పెళ్లిపీటలెక్కనున్న ఇరుముడి హీరోయిన్!



తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ త్వరలోనే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతోంది. కొన్నేళ్లుగా తన ప్రియుడు రాజ్‌వెల్ రాజ్‌తో ప్రేమలో ఉన్న ఈ బ్యూటీ.. ఇప్పుడు అతడితో ఏడడుగులు వేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రియా తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫొటోలు ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. దీంతో అభిమానులు, నెటిజన్లు ఈ జంటకు ముందుగానే శు భాకాంక్షలు తెలియజేస్తున్నారు. ప్రియా భవానీ శంకర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో కొన్ని ప్రత్యేకమైన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. వాటిల్లో ఆమె సంప్రదాయ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించడంతో పాటు మెడలో మల్లెపూల దండలు ధరించి కనిపించారు. చేతులకు గోరింటాకు పెట్టుకున్న ఫొటోలను కూడా షేర్ చేశారు. ఇవన్నీ చూస్తుంటే ఆమె ఇంట్లో పెళ్లి వేడుకలకు సంబంధించిన సందడి మొదలైనట్లు అభిమానులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఈ వేడుకలు ప్రారంభమైనట్లు సమాచారం. అయితే ఇవి అధికారికంగా ప్రీ వెడ్డింగ్ వేడుకల ఫొటోలేనా? వివాహానికి సంబంధించిన ఇతర కార్యక్రమాలు ఎప్పుడు జరగనున్నాయి? అనే విషయాలపై ప్రియా నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రియా భవానీ శంకర్, రాజ్‌వెల్ రాజ్ ప్రేమకథ విషయానికి వస్తే.. వీరిద్దరికీ కాలేజీ రోజుల నుంచే పరిచయం ఉంది.

ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో అప్పటి నుంచి ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ తమ బంధాన్ని కొనసాగిస్తున్నారు. 2022లో ఈ జంట కలిసి తమ కలల ఇంటిని కొనుగోలు చేయడం అప్పట్లో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం ప్రియా భవానీ శంకర్ తన ప్రియుడు రాజ్‌వెల్ రాజ్‌ను కుటుంబ సభ్యులు, అత్యంత ఆత్మీయుల సమక్షంలో వివాహం చేసుకోవాలని భావిస్తున్నారట. భారీ హంగామా లేకుండా, సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుకను నిర్వహించేందుకు ఇరు కుటుంబాలు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు పెళ్లి తేదీ, వివాహ వేదికకు సంబంధించిన వివరాలను ఈ జంట అధికారికంగా ప్రకటించలేదు.

'రంగస్థలం' కంటే 'ఇట్లు అర్జున' పెద్ద హిట్ అవ్వాలి
గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్

హైదరాబాద్: "నేను చెవిటి పాత్రలో చేసిన 'రంగస్థలం' కన్నా.. అనీష్ మూగవాడిగా చేసిన 'ఇట్లు అర్జున' ఇంకా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నా" అని కథా నాయకుడు రామ్‌చరణ్ పేర్కొన్నారు. అనీష్ హీరోగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని మహేష్ ఉప్పుల తెరకెక్కించగా వెంకీ కుడుముల నిర్మించారు. అనస్వర రాజన్ కథానాయికగా నటించిన ఈ చిత్రం అక్కినేని నాగార్జున సమర్పణలో ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ఈ చిత్ర మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ వేడుకకు కథా నాయకులు రామ్‌చరణ్, అఖిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ... "కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు నాగార్జున. ఆయన ఈ సినిమాని సమర్పిస్తున్నారం టేనే.. ఈ చిత్ర విషయంలో ఎక్కడా తప్పు జరిగే అవకాశమే లేదనిపిస్తోంది. అనీష్ ఏడాది క్రితమే ఈ సినిమా గురించి చెప్పాడు, కొన్ని సీన్స్ చూపించాడు. నా తొలి సినిమా అప్పుడు నేనెలా చేశానో నాకు గుర్తులేదు కానీ.. తను ఇందులో నాకన్నా పది రెట్లు అద్భుతంగా చేశాడనిపించింది. ఇందులో మూగవాడిగా చేస్తూ నవరసాలనూ అద్భుతంగా పలికించాడు. స్వతహాగా సినిమాల పట్ల, నటన పట్ల తనకున్న ప్యాషన్ వల్లే ఇంత గొప్పగా నటించగలిగాడనిపించింది. ఈ చిత్రం తనకి ఒక మైలురాయిలా నిలవాలి, తను కచ్చితంగా చాలా కాలం పాటు ఈ ఇండస్ట్రీలో ఉంటాడు" అన్నారు. "అనీష్ ఈ కథ గురించి చెప్పినప్పుడు షాక్ అయ్యా. మాటల్లేకుండా సినిమానా, ఎలా చేస్తారో అనుకున్నా. కానీ ఈ చిత్రం చూశాక దర్శకుడు మహేష్ దీన్ని ఎంతో అద్భుతంగా తీశారనిపించింది. ఇది ఈతరం కమర్షియల్ సినిమా. ఓ చిన్న ఆఫ్-బీట్ కంటెంట్‌తో రూపొందించారు. ఇందులో అనీష్-అనస్వరల కెమిస్ట్రీ అందర్నీ ఆకట్టుకుంటుంది. తమన్ ఇచ్చిన పాటలు, నేపథ్య సంగీతం ఆకర్షణగా నిలుస్తాయి" అని హీరో అఖిల్ తెలిపారు.

